

తుని వద్ద పోలవరం ఎడమ కాలువ వద్ద పనులు జరుగుతున్న దృశ్యం



తుని వద్ద జరుగుతున్న పోలవరం పనుల దృశ్యం


శరవేగంగా పోలవరం పనులు

- చివరి దశకు ఎడమ కాలువ
- ఐదవ ప్యాకేజీ పనులు
- తుని వద్ద అక్విడెక్టు పనులు పూర్తి

తుని రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల విరామం తర్వాత పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కాకినాడ జిల్లా తుని వద్ద కుమ్మరిలోవ ప్రాంతంలో పోలవరం ఎడమ ప్రధాన కాలువ నిర్మాణ పనులు చివరి దశకు చేరాయి. ఐదవ ప్యాకేజీలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి పెద్ద వర్కుల్లో ఒకటైన ఈ పనులు యంత్రాంగానికి సవాల్‌గా మారిన వాటిని అధిగమించి పనులు పూర్తి చేస్తూ ప్రభుత్వ లక్ష్యానికి చేరువకావడం విశేషం. ఈ ఐదవ ప్యాకేజీలో అన్నవరం నుంచి తుని వరకు 18.65 కిలోమీటర్ల మేర కాలువ నిర్మాణం జరుగుతోంది. ఈ పనులకు రూ.352 కోట్ల అంచనాతో చేపట్టి ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేయడమే లక్ష్యంగా పని చేశారు. ఇందులో భాగంగా కుమ్మరిలోవ వద్ద 123 మీటర్లు, 115 మీటర్లు ఎత్తుగల రెండు కొండలు తొలగింపు పనులు తుది దశకు చేరాయి. వీటిని 28 మీటర్లు తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టారు. రోజుకు 25 వేల క్యూబిక్ మీటర్ల మేర మట్టిని తవ్వుతున్నారు. అన్నవరంలోని పంపా రిజర్వాయర్, తాండవ పరీవాహక ప్రాంతాల్లో 2 అక్విడెక్ట్ పనులకు సంబంధించి తుని వద్ద పనులు దాదాపు పూర్తి అవ్వగా, అన్నవరం వద్ద తుది దశకు చేరుతున్నాయి. ఐదవ నెంబరు ప్యాకేజీలో పనులకు సంబంధించి ఇంతవరకు 50 శాతం పైబడి, సీసీ లైనింగ్ 35 శాతం పైబడి, స్ట్రెచ్చర్ కాంక్రీట్ పనులు 70 శాతం పూర్తయ్యాయి. చెందుర్తి, కత్తిపూడి, బెండపూడి, అన్నవరం, గవరయ్య కోనేరు ప్రాంతాల్లో జాతీయ రహదారి మీదుగా సర్వీసు రోడ్డు పనులు పూర్తిచేశారు. ఆ ప్రాంతంలో బ్రిడ్జి నిర్మాణాలు పూర్తయితే 5వ ప్యాకేజీల పనులు దాదాపుగా పూర్తయినట్టు అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ పోలవరం ఎడమ ప్రధాన కాలువ 214.808 కిలోమీటర్లు కాగా ప్రాజెక్టు పూర్తయితే ఆయకట్టులో 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. కాలువసామర్థ్యం 17,561 క్యూసెక్కులుకాగా నీటి కేటాయింపు 108248 టీఎంసీలు. ఇందులో సాగునీరు 84808 టీఎంసీలు, తాగునీరు, పరిశ్రమలకు 2344 టీఎంసీలు అందనుంది.

తూరుపు.. సిందూరం!

ఉమ్మడి తూర్పుగోదావరి సిగలో మరో కొత్త జిల్లా



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలు మూడు కాదు.. నాలుగు కానున్నాయి.. రంపచోడవరం కేంద్రంగా మరో కొత్త జిల్లా పోలవరం ఏర్పాటు కానుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను 2022లో అప్పటి వైసీపీ ప్రభుత్వం కాకినాడ, రాజమహేంద్రవరం, కోనసీమ పార్లమెంట్ నియోజకవర్గాలను మూడు జిల్లాలుగా ప్రకటించింది. నాడు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విభజన జరగలేదు. అప్పట్లో ప్రజలు ఉద్యమాలు చేసినా పట్టించుకోలేదు. ప్రభుత్వం మారిన తరువాత సీఎం చంద్రబాబు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని నిర్ణయించారు. ఏజెన్సీలో రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేస్తున్నారు.. కాకినాడ డివిజన్‌లో ఉన్న సామర్లకోటను పెద్దాపురం డివిజన్‌లో కలిపారు. మండపేట నియోజకవర్గాన్ని తూర్పులో విలీనం చేయనున్నారు.

మండపేట కేరాఫ్ తూర్పుగోదావరి

కోనసీమ జిల్లాలో ఉన్న మండపేట నియోజకవర్గాన్ని పూర్తిగా తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయనున్నారు. మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలు రాజమహేంద్రవరానికి సమీపంలో ఉన్నాయి. మండపేట రాజమహేంద్రవరానికి 26.3 కి.మీ దూరంలో ఉండగా ప్రస్తుత జిల్లా కేంద్రం అమలాపురం 47.5 కి.మీ దూరంలో ఉంది.మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సైతం మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలని అసెంబ్లీలో కోరారు.ఇదే ప్రతిపాదన మంత్రి వర్గ ఉపసంఘం చేయడంతో ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తాజా మార్పులతో రామచంద్రపురం రెవెన్యూ డివిజన్‌లోని మండపేట నియోజకవర్గం తొలగిపోనుండడంతో రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ అతి చిన్నదిగా మారిపోతోంది. ఈ డివిజన్‌ను అలాగే ఉంచుతారా లేదా సమీపంలోని కొత్తపేట డివిజన్‌లో కలుపుతారా అనేది చూడాలి. దీంతో కోనసీమ జిల్లాలోని నియోజకవర్గాల సంఖ్య ఆరుకు పడిపోగా.. తూర్పుగోదావరి జిల్లాలో నియోజకవర్గాల సంఖ్య 8కి చేరింది. ఇప్పటికే ముమ్మిడివరం నియోజకవర్గం తాళ్లరేవు మండలం కాకినాడ జిల్లాలోను రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు మండలం కాకినాడ జిల్లాలో ఉండడంతో కోనసీమ చిన్న జిల్లాగా మారింది.దీనిపై రాజకీయంగా ఉద్యమాలు ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

- పోలవరం జిల్లా ఏర్పాటు
- రంపచోడవరం కేంద్రం
- రెండు డివిజన్లతో నిర్ణయం
- నాలుగుకు పెరిగిన జిల్లాలు
- 'తూర్పు'న కలిసిన మండపేట
- పెద్దాపురానికి..సామర్లకోట
- ప్రజల ఆకాంక్షలకు పెద్దపీట
- గిరిజనానికి తీరిన ఇబ్బంది
- ఇక ఆమోదమే తరువాయి..

గిరిజనానికో జిల్లా

రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు కానుంది. గత ప్రభుత్వ నిర్వాకంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలోకి రంపచోడవరం నియోజకవర్గం వెళ్లిపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. రంపచోడవరం, చింతూరు డివిజన్‌ల పరిధిలోని రంపచోడవరం, దేవీపట్నం, మారేడుమిల్లి, గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజఒమ్మంగి, చింతూరు, వి.ఆర్.పురం, కూనవరం, ఎటపాక మండలాల ప్రజానీకం జిల్లా కేంద్రానికి 300 కి.మీ దూరంలో ఉన్న పాడేరు వెళ్లాల్సి వచ్చేది. మంత్రివర్గ ఉపసంఘం నివేదిక మేరకు సీఎం చంద్రబాబు రంపచోడవరం కేంద్రం పోలవరం జిల్లా ఏర్పాటుకు నిర్ణయించడంతో ప్రజల వెతలు తీరనున్నాయి. 2022లో చంద్రబాబు చింతూరు డివిజన్‌లోని కూనవరం మండలం కోతులగుట్టలో పర్యటించారు. మేము అధికారంలోకి రాగానే పోలవరం జిల్లా ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చారు. ఈ మేరకు 11 మండలాలతో సుమారుగా 3.49 లక్షల జనాభాతో భౌగోళికంగా ఈ కొత్త జిల్లా ఆవిర్భవించనున్నది. వై రామవరం మండలంలోని గుర్తేడు కేంద్రంగా మండలం ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. తుది నోటిఫికేషన్ విడుదల కావాల్సి ఉంది. ప్రస్తుతం 11 మండలాలతో జిల్లా ఏర్పాటుచేసినా దేవీపట్నం, కూనవరం, వీ.ఆర్.పురం, చింతూరు, ఎటపాక మండలాల్లో 150 గ్రామాలు పోలవరం ముంపులోనికి వెళ్లిపోతాయి. పూర్తిగా కూనవరం, వీ.ఆర్.పురం, దేవీపట్నం మండలాలు కనుమరుగైపోతాయి. చింతూరు, ఎటపాక మండలాల్లో పలు గ్రామాలు ముంపులోనికి వెళ్లిపోతాయి. దీంతో కొత్త జిల్లాలో 8 నుంచి 9 మండలాలే మిగులుతాయి. ఈ పరిస్థితుల్లో పోలవరం నియోజకవర్గాన్ని ఈ జిల్లాలో కలిపితే ఎలా ఉంటుందని యోచిస్తున్నారు. అక్కడా పోలవరం, కుకునూరు, వేలేరుపాడు మండలాలు ముంపులోకి వెళ్లిపోతాయి. గిరిజన జిల్లాలకు రెవెన్యూ ఎలా ఉంటుందనే చర్చ సాగుతోంది. ప్రస్తుతం అల్లూరి జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లాలకు రెవెన్యూ లేదు. అయినా రంపచోడవరం, చింతూరు డివిజన్ల ప్రజల సమస్యలను ఎలా తీర్చాలన్న అంశంపై ప్రభుత్వం యోచిస్తోంది. పోలవరం జిల్లా ఏర్పాటుతో రాష్ట్రంలో ఇది మూడో గిరిజన జిల్లా. భవిష్యత్తులో మూడు జడ్పీలు గిరిజనులకు కేటాయించబడతాయి. గిరిజన స్వపరిపాలన లక్ష్యం దిశగా కూటమి సర్కారు అడుగులు వేసినట్టవుతుంది.



చారిత్రాత్మక నిర్ణయం

రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం. ముంపు ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంతో జిల్లా ఏర్పాటు అంశం తాజాగా తెరమీదకు వచ్చింది.
- మిరియాల శిరీషాదేవి, రంపచోడవరం ఎమ్మెల్యే

నేడే ఆమోద ముద్ర

కొత్త జిల్లాల ఏర్పాటు, కొన్ని జిల్లాల్లో మార్పులుచేర్పులను సీఎం చంద్రబాబు మంగళవారం ఆమోదించిన వెంటనే నోటిఫికేషన్ జారీ అవుతుందనే ప్రచారం జరిగింది. ఈ మేరకు బుధవారం ఆమోదిస్తారనే ప్రచారం ఉంది. ఆమోదించిన వెంటనే అదే రోజు నోటిఫికేషన్ ఇస్తారు. అప్పటి నుంచి మండపేట నియోజకవర్గం కూడా తూర్పుగోదావరి జిల్లాలోకి వస్తుంది. ఇప్పటికే తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కొత్త మ్యాప్ రూపొందించడం.. కొత్తగా పెరిగే గ్రామాలు, మండలాల కసరత్తు మొదలైంది.

పెద్దాపురం డివిజన్‌కు సామర్లకోట

కాకినాడ డివిజన్‌లో ఉన్న సామర్లకోట మండలాన్ని పెద్దాపురం డివిజన్‌లోకి చేర్చుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో సామర్లకోట, పెద్దాపురం మండలాలు కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోల పరిధిలో వేర్వేరుగా ఉన్నా యి. దీనివల్ల పాలనాపరమైన ఇబ్బందులు వస్తున్నాయి. దీంతో సామర్లకోట మండలాన్ని కాకినాడ రెవెన్యూ డివిజన్ నుంచి తప్పించి పెద్దాపురం డివిజన్‌లో విలీనం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కాకినాడ జిల్లాలో ఉన్న కాజులూరు మండలాన్ని కోనసీమ జిల్లాలో విలీనం చేయాలని ఉపసంఘం ప్రతిపాదించింది. కాజులూరు పేరుకు కాకినాడ జిల్లాలో ఉన్నప్పటికీ ఈ మండలం కోనసీమ జిల్లాలోని రామచంద్రపురం నియోజకవర్గంలో కొనసాగు తోంది. దీనిపై ప్రభుత్వం ఎటూ నిర్ణయం తీసుకోలేదు. దీంతో కాజులూరు కాకినాడ జిల్లాలో కొనసాగనుంది.

- (రంపచోడవరం/చింతూరు/ రాజమహేంద్రవరం/అమలాపురం/ మండపేట/ కాకినాడ- ఆంధ్రజ్యోతి)

విభజన జరిగింది ఇలా..

కొత్త జిల్లాల్లో పర్యటించి ఎక్కడెక్కడ ఎలాంటి మార్పులు, చేర్పులు చేయాలనే దానిపై అధ్యయనం చేయాలని ఏడుగురు మంత్రులతో కూడిన ఉపసంఘాన్ని ఈ ఏడాది జూలైలో ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల పర్యటించింది. విభజిత జిల్లాలో ఎలాంటి మార్పులు చేయాలనేది పరిశీలించి సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసింది. నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి అందించింది.

మా పోరాటం ఫలించింది



మా పోరాటం ఫలించింది. కూటమి ప్రభుత్వం మండపేట నియోజకవర్గ ప్రజలు ఆకాంక్షను నిజం చేసింది. మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరిలో కలుపుతూ తీసుకున్న నిర్ణయం శుభపరిణామం. ఇది సమష్టి విజయం. నియోజకవర్గ ప్రజల ఇబ్బందులు తీరతాయి. - వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్యే

ధాన్యం కొనుగోలు కేంద్ర సిబ్బంది తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సామర్లకోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామరైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు సిబ్బంది ముగ్గురిని విధుల నుంచి తొలగించినట్టు మండల వ్యవసాయాధికారి వి.మురళీధర్ వెల్లడించారు. 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం రైతుల్లో కలవరం పేరిట సిబ్బంది నిర్లక్ష్యంపై కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీంతో జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయకుమార్ ఆదేశాల మేరకు మండల వ్యవసాయాధికారి మురళీధర్ మంగళవారం వేట్లపాలెం ఆర్ఎస్‌కే కేంద్రానికి చేరుకున్నారు. అదే సమయంలో జీ.మేడపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు పాలకుర్తి వీరభావన్నారాయణ (రవిబాబు) తదితర పీఏసీఎస్ సిబ్బంది వచ్చారు. పత్రికలో వచ్చిన కథనం మేరకు వాస్తవ సమాచారం సేకరించి సిబ్బంది నిర్లక్ష్యం, రైతుల పట్ల అమర్యాదగా వ్యవహరించడం, నమోదులో అవకతవకలకు పాల్పడడం వంటి అంశాలను ప్రాథమికంగా గుర్తించారు. ఈ నెల 18న ధాన్యం కొనుగోలు కేంద్రానికి సరఫరా చేసిన ధాన్యానికి చెంది ఏడు రోజులైనా నమోదు కాకపోవడాన్ని ఎంఏవో గుర్తించి మంగళవారం జనరేట్ చేయడం, జనరేట్ చేసిన కేవలం రెండు గంటలకే రైతు ఖాతాలో సొమ్ములు జమఅవ్వడంతో సిబ్బంది నిర్లక్ష్యాన్ని స్వయంగా ఎంఏవో గుర్తించి సిబ్బందిపై చర్యలకు ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జీ.మేడపాడు పీఏసీఎస్ ద్వారా సిబ్బందిని ప్రొక్యూర్ చేసినందున తొలగించిన సిబ్బంది స్థానంలో ప్రత్యామ్నాయంగా మరో ముగ్గురి సిబ్బందిని సమకూర్చాలని పీఏసీఎస్ అధ్యక్షుడు పాలకుర్తి రవిబాబును ఎంఏవో మురళీధర్ ఆదేశించారు. దీంతో రైతుల సమస్య తొలగిందని రైతులు భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవచ్చని ఎంఏవో మురళీధర్ రైతులకు ఈ సందర్భంగా తెలియజేశారు.

నూరుశాతం గర్భిణుల నమోదు ప్రక్రియ

డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్



జీజీహెచ్ (కాకినాడ), నవంబరు25(ఆంధ్ర జ్యోతి):జిల్లాలో గర్భిణుల నమోదు ప్రక్రియ నూటికి నూరుశాతం పూర్తిచేయడం పట్ల డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ హర్షం వ్యక్తంచేశారు. ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో గర్భిణుల నమోదు ఈ ఏడాది ఇప్పటివరకు లక్ష్యం 20189 కాగా 20,362 నమోదైనట్టు డీఎంహెచ్‌వో వెల్లడించారు. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామ ఆరోగ్య, వెల్‌నెస్ కేంద్రాల్లో ఇకపై గర్భిణుల నమోదు పూర్తిస్థాయిలో జరగాలని ఆదేశించారు. గర్భిణులకు సకాలంలో వైద్య సేవలు క్రమం తప్పకుండా అందించాలన్నారు. ప్రతి పీహెచ్‌సీ పరిధిలో ఉన్న గర్భిణులందరినీ సంబంధిత వైద్యాధికారులు సకాలంలో అన్ని పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య సమాచారంతోపాటు వారికి ఏమైనా మందుల వల్లకాని, ఏమైనా ఆహార పదార్థాల ద్వారాగాని ఎలర్జీ సంబంధిత చరిత్ర, లక్షణాలు ఉంటే వారి ఎంసీపీ కార్డులో తప్పనిసరిగా నమోదు చేసి ప్రసవ సమయంలో ఇబ్బందులు, ప్రమాదం తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యలను పాటిస్తూ మాతృ శిశుమరణాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

నాడు.. నేడింతేగా!

అసంపూర్తిగా పాఠశాలల భవన నిర్మాణాలు



సామర్లకోట మునిసిపల్ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా వదిలేసిన అదనపు గదులు

- అసంపూర్తిగా భవన నిర్మాణాలు
- విద్యార్థులకు తీరని ఇక్కట్లు
- ఆరు బయట చదువులు
- పేరుమార్చినా ఫలితం లేదు
- 18 నెలలుగా సాగని వైనం

సామర్లకోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు అంటూ పాఠశాలల్లో భవన నిర్మాణాలు చేపట్టి అసంపూర్తిగా వదిలేసింది. కూటమి ప్రభుత్వం నాడు నేడు పేరును మనబడి-మనభవిష్యత్ అని మార్చింది. అయితే పేరు మార్చిన ప్రభుత్వం 18 నెలలుగా పాఠశాలల్లో పనులను పట్టించుకోలేదన్న ఆవేదనలు పాఠశాలల నుంచి వినవస్తున్నాయి. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలో పలు మండల పరిషత్, జిల్లా పరిషత్, మునిసిపల్ ఉన్నత పాఠశాలల్లో తరగతి గదుల సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వరండాలలో, చెట్లకింద బోధనలతో ఉపాధ్యాయులు సరిపెడుతున్నారు. ఇప్పటికే సామర్లకోట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆరుబయట చెట్ల కింద నిత్యం బోధనాతరగతులు నిర్వహిస్తున్న విషయం విదితమే. అయినా అధికారులు, పాలకులు అసంపూర్తి నిర్మాణాలపై దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వినవస్తున్నాయి. ఇప్పటికే పలు పాఠశాలల ఎస్ఎంసీ కమిటీల సమావేశాలలో ప్రభుత్వ వైఖరిని దుయ్యబడుతున్నారు. పనులు ఎప్పటికి పూర్తవుతాయో తరగతి గదులు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయో తెలియక ఉపాధ్యాయులు, విద్యార్థులు మదనపడుతున్నారు. నాడు-నేడు పేరుతో గత వైసీపీ ప్రభుత్వం రెండు దశల్లో రూ. 700 కోట్లకు పైబడి నిధులు వెచ్చించి పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణాలను చేపట్టింది. ఐదేళ్ల పనులు సక్రమంగా జరగలేదు. పెద్దఎత్తున అవకతవకలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటి వరకూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో సుమారు రూ. 500 కోట్ల పైబడి నిర్మాణాలు పూర్తిగా అసంపూర్తిగా ఉన్నాయి. దాదాపు 480పైగా ఉన్నత పాఠ శాలల్లో 60 శాతానికి పైగా నిర్మాణాలు జరిగాయి. అయితే వాటికి ప్రస్తుత ప్రభుత్వం నిధులు చెల్లించలేదు. ఆయా భవనాల నిర్మా ణాలు పూర్తయితే తరగతి గదుల కొరత తీరు తుందని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యా యులు చెబుతున్నారు. సామర్లకోట అయోధ్యమారపురం మునిసిపల్ ఉన్నత పాఠశాల, ఎస్టీజీకె మునిసిపల్ ఉన్నత పాఠశాల వైఎంహెచ్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, వేట్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జి.మేడపాడు జడ్పీ ఉన్నత పాఠశాల ఇలా అనేక పాఠశాలలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. వేట్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల, పెదబ్రహ్మదేవం జడ్పీ ఉన్నత పాఠశాలల నిర్మాణలపై పలు అవకతవకలు జరిగాయని అప్పట్లో పత్రి కల్లో సైతం కథనాలు వెలువడిన విషయం విదితమే.

కొలిక్కిరాని విచారణలు

గత ప్రభుత్వం నాడునేడు పేరుతో తల్లిదండ్రుల కమిటీలకు నిర్మాణ బాధ్యతలను అప్పగించింది. పేరుకు తల్లిదండ్రుల కమిటీలు ఉన్నా దాని వెనుక మాత్రం వైసీపీ అనుచరగణం, అప్పటి వైసీపీకి అంటకాగిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెరవెనుక నిర్మాణాలు చేపట్టిన విషయం నగ్నసత్యం. నాణ్యతా లోపాలతో పాటు నిర్మాణాల విషయంలో అనేక అరోపణలు వచ్చాయి. దీంతో కూటమి ప్రభుత్వం ఆయా పనులపై విచారణలు చేపట్టాలని నిర్ణయించింది. అయితే విచారణ ఎంతవరకు వచ్చిందో కూడా అర్థం కావడం లేదని పలు పాఠశాలల ఉపాధ్యాయులు వాపోతున్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు

వికసిత్ గ్రామీణ భారత్ దిశగా ఆర్థిక స్వావలంబన

డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): లింగ అసమానత్వ సమస్యలు ఎదుర్కొనేందుకు 'నూతన చైతన్యం 4.0 మార్పుకోసం ముందడుగు' వికసిత్ గ్రామీణ భారత్ దిశగా సమ్మిళిత వృద్ధికి ఆర్థిక సాధికారతకు మహిళలే ముందు ఉండాలనే నినాదంతో జిల్లాలో కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పీడీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. నూతన చైతన్య 4.0 ప్రచారాన్ని మంగళవారం న్యూఢిల్లీ నుంచి వ్యవసాయ, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ వర్చువల్‌గా ప్రారంభించిన కార్యక్రమాన్ని కాకినాడ డీఆర్‌డీఏ కార్యాలయం నుంచి పీడీపాటు జిల్లా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా లింగ అసమానత్వ సమస్యలను ఎదుర్కొనే లక్ష్యంతో సోమవారం నుంచి డిసెంబరు 23 వరకు నూతన చైతన్యం 4.0 మార్పు కోసం ముందడుగు వికసిత్ గ్రామీణ భారతదేశంగా సమ్మిళిత వృద్ధికి ఆర్థిక సాధికారతకు మహిళలే ముందు ఉండాలన్నారు. జిల్లాలో అన్ని మండలాల్లో మంగళవారం నుంచి నెలరోజులపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. నూతన చైతన్యం 4.0 ద్వారా మహిళా సంఘాల్లో గ్రామ, మండలస్థాయిలో లింగ అసమానతలు, హింస, వివక్షపై అవగాహన పెంచాలన్నారు. కుటుంబం, సమాజంలో మహిళల ఆర్థిక సహాయదారులు గుర్తింపు, మహిళల గృహ సంరక్షణ పనులను గుర్తించడం, జెండర్ ఆధారిత వివక్ష, హింసను తగ్గించడం కోసం మహిళల ఆర్థిక సాధికారతను పెంచాలన్నారు. ఏపీడీ జిలాని, డీపీఎంలు పాల్గొన్నారు.




కోనసీమకు పవన్‌కల్యాణ్

- నేడు డిప్యూటీ సీఎం పర్యటన
- దెబ్బతిన్న కొబ్బరి తోటల పరిశీలన
- శివకోడులో బహిరంగ సభ

7

నంది అవార్డులు ఇస్తాం : మంత్రి దుర్గేష్
బోర్డు తిప్పేసిన వినాయక చిట్స్
కాకినాడ జీజీహెచ్‌లో అందని వైద్యం..ఆగిన ప్రాణం!
7





భక్తులకు స్వాగతం పలుకుతున్న కుమారసుబ్రహ్మణ్యేశ్వరుడు, ఆకట్టుకుంటున్న అనంత పద్మనాభస్వామి, దేవతామూర్తుల విద్యుద్దీపాలంకరణ

సుబ్బారాయుడు షష్ఠి

బిక్కవోలు వెళ్లొద్దాం రండి

- కుమారసుబ్రహ్మణ్య షష్ఠి తీర్థానికి విస్తృత ఏర్పాట్లు
- ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాలంకరణలు






బిక్కవోలు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సుబ్బారాయుడి షష్ఠి అనగానే ముందుగా గుర్తుకొచ్చేది బిక్కవోలు. ఇక్కడే జరిగే ఉత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా పేరొందాయి. తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలులో శ్రీకుమార సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. బుధవారం షష్ఠి తీర్థానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం తెల్లవారు జామున 1.10 గంటలకు తీర్థపు బిందె సేవతో ఉత్సవాలను ప్రారంభించి భక్తులకు స్వామి దర్శనం కల్పిస్తారు. ఉదయం 8.20 గంటలకు మయూర వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం జరుపుతారు. మధ్యాహ్నం 4 నుంచి 5 గంటల వరకూ బాణసంచా కాలుస్తారు. రాత్రి 8 గంటలకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. తీన్‌మార్ డప్పులు, కేరళ వాయిద్యాలు, బ్యాండు కచేరీలు, శక్తి వేషాలు ఏర్పాటు చేశారు. రాత్రి 10 గంటల నుంచి తెల్లవారే వరకు స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో బాణసంచా కాలుస్తారు. షష్ఠి సందర్భంగా బిక్కవోలు వంతెన వద్ద రామాలయం నుంచి సినిమాహాలు సెంటరు వరకు విద్యుద్దీపాలంకరణ చేశారు. అరపలతో రంగురంగుల ఎల్‌ఈడీ బల్బులతో దేవతామూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. కళావేదిక డెకరేషన్ ప్రత్యేకాకర్షణగా నిలుస్తోంది. ఆలయ పరిసరాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. గురువారం మధ్యాహ్నం 1.17 గంటలకు రథోత్సవం జరుగుతుంది. బుధవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు కళా వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. డిసెంబరు 1న ఏకాహం, 2న భారీ అన్నదానంతో ఉత్సవాలు ముగిస్తాయి.

షష్ఠి ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 300 మందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్టు ఎస్‌ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపారు. పారిశుధ్య పనుల నిర్వహణకు 55 మందిని నియమించామని పంచాయతీ కార్యదర్శి పద్మజ తెలిపారు. రెండు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని మండల వైద్యాధికారి దుర్గాదేవి తెలిపారు. భక్తులు స్వామిని దర్శించుకోవడానికి ఆలయం మూడువైపులా క్యూలైన్లు ఏర్పాటు చేశామని కార్యనిర్వహణాధికారి ఆకెళ్ల భాస్కర్ తెలిపారు.





ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన క్యూలైన్లు



శోభాయమానంగా....



సుబ్రహ్మణ్య షష్ఠికి కాకినాడ జిల్లాలోని పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో కొలువైయున్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు (ఎడమ). అపర్ణా సమేత నాగేశ్వరస్వామి విగ్రహాలు కోనేరులో ప్రతిబింబిస్తూ భక్తులను ఆకట్టుకుంటున్నాయి. (పైన)

- గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి)

భీమేశ్వరునికి కేంద్ర పర్యావరణ శాఖ ప్రత్యేక కార్యదర్శి భట్టాచార్య ప్రత్యేక పూజలు

సామర్లకోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పర్యావరణ శాఖ ప్రత్యేక కార్యదర్శి, ఐఎఫ్ఎస్ అధికారి ఏకే భట్టాచర్య సతీసమేతంగా మంగళవారం కాకినాడ జిల్లా సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయానికి విచ్చేశారు. న్యూఢిల్లీ నుంచి ప్రత్యేక వాహనంలో వచ్చిన వారికి కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సోమేశ్వర శర్మ, చెరుకూరి సుందరరామయ్య (రాంబాబు), రాజగోపాలశర్మ, అంజిబాబు, వెంకన్న వేదమంత్రోచ్చారణలతో సాదర స్వాగతం పలికారు. ఉపాలయాల్లో దేవతామూర్తులను దర్శించిన అనంతరం భట్టాచార్య దంపతులు భీమేశ్వరస్వామికి అభిషేకం, బాలాత్రిపురసుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన చేశారు. వారికి నంది మండపం వద్ద పండితులు వేదాశీర్వచనం ఇచ్చారు. ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను సూపరింటెండెంట్ ఈశ్వరరావు అందజేశారు. జిల్లా ఉన్నతాధికారులు శ్రీనువాసు, సత్యనారాయణ, పట్టాభి, జిల్లా సామిల్లు యజమానుల సంక్షేమ సంఘ ప్రతినిధి మహంకాళి వెంకటగణేష్ తదితరులు పాల్గొన్నారు.



భట్టాచార్య దంపతులకు వేదాశీర్వచనం, స్వామి-అమ్మవార్ల చిత్రపటం ఇస్తున్న దృశ్యం

అన్ని వర్గాలకు న్యాయం చేసేది కాంగ్రెస్సే

సంఘటన్ శ్రీజాన్ అభియాన్‌లో ఏఐసీసీ అబ్జర్వర్ అంబా ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న అబ్జర్వర్ అంబా ప్రసాద్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడుతూ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ఏఐసీసీ అబ్జర్వర్ అంబా ప్రసాద్ అన్నారు. రాజమహేంద్రవరం మునిసిపల్ కాలనీలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన సంఘటన్ శ్రీజాన్ అభియాన్‌కు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అంబాతో పాటు పీసీసీ మహిళా విభాగం ఇన్‌చార్జి పరిశీలకురాలు అబిత, పీసీసీ పరిశీలకులు రాజీవ్ రతన్, బాజ్జీ, మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఈ కార్యక్రమం చాలా ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణం చేపట్టామ, పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు ఇవ్వడానికి ఈ విధానాన్ని ఏఐసీసీ అమల్లోకి తెచ్చిందన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడేలా పార్టీ నాయకులు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను తొలగించి ఏపీలో అధికారంలోకి తెచ్చేలా దివంగత సీఎం వైఎస్‌ఆర్ స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో నాయకుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించి నేరుగా ఏఐసీసీ నాయకులతో మాట్లాడేందుకు అవకాశం కల్పించాలన్నదే కాంగ్రెస్ లోక్ సభాపక్షనేత రాహుల్‌గాంధీ ఉద్దేశ్యమన్నారు. అనంతరం వారిని విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సత్కరించారు. సమావేశంలో ఏఐసీసీ సభ్యురాలు అమర్ జహబేగ్, పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూధర్, నాయకులు డాక్టర్ వడయార్, బాలేపల్లి మురళీధర్, జేటీ రామారావు, మేడవరపు భద్రం దొర, ఎస్‌కే అర్షద్, మోతా శారద తదితరులు పాల్గొన్నారు.

జాతీయ యోగా పోటీలకు ఇద్దరి ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ జగన్నాథపురం సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ గర్ల్స్ స్కూల్ విద్యార్థిని ఆర్.చైత్ర శివవాసుకి, చర్చ్ స్క్వేర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని జి.లహరిదుర్గ జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. వీరిద్దరూ ప్రకాశం జిల్లా చందలూరులో ఈనెల 23 నుంచి 25 వరకు జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ యోగా అండర్-17 బాలికల ఆర్టిస్టిక్ పెయిర్ విభాగం పోటీలో పాల్గొన్నారు. ఇందులో ప్రథమస్థానం సాధించి జనవరి మొదటి వారంలో త్రిపురాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికయ్యారు. కె.చైత్ర వాసుకి యోగా ట్రెడిషనల్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించింది. జగన్నాథపురం సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ గర్ల్స్ స్కూల్ విద్యార్థినులు హాసిని, ప్రజ్ఞ అండర్-14 విభాగంలో ఆర్టిస్టిక్ పెయిర్ ఈవెంట్‌లో రాష్ట్ర ద్వితీయ స్థానం సాధించారు. విజేతలకు, స్కూలు యాజమాన్యాలకు జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీలు శ్రీనివాస్, సుధారాణి, సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మలకుమారి, పీఈటీ త్రిపుల అభినందనలు తెలిపారు.

నిడదవోలులో ఘనంగా
డైమండ్ జూబ్లీ వేడుకలు

నిడదవోలు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లాలో భాగంగా ఉన్న నిడదవోలు పురపాలక సంఘం ఏర్పడి 60 వసంతాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న డైమండ్ జూబ్లీ వేడుకల్లో భాగంగా రూ.131 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు పురపాలక సంఘ అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఈ నెల 26వ తేదీ బుధవారం మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణ, నవంబరు 27వ తేదీ గురువారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా శంకుస్థాపనలకు శ్రీకారం చుట్టనున్నారు.

నన్నయ ఉమెన్ ఇంటర్ కాలేజీ బాక్సింగ్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉమెన్ ఇంటర్ కాలేజి బాక్సింగ్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్-2025-26 మంగళవారం రాజమహేంద్రవరంలోని శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహించారు.ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి అధ్యక్షతన జరిగిన ఈ పోటీల్లో వివిధ కళాశాలలకు చెందిన క్రీడాకారిణులు పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించిన వారికి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ అండ్ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ కేవీ స్వామి చేతుల మీదుగా మెడల్స్ ప్రదానం చేశారు.ఈ టోర్నమెంట్‌కు యూనివర్సిటీ అబ్జర్వర్‌గా ఎంవీవీ మూర్తి విచ్చేశారు.సెలెక్టర్స్‌గా బి.మధుబాబు(రాజోలు డిగ్రీ కాలేజీ), ఎన్.నరసింహారావు(వైజాగ్ రైల్వే బాక్సింగ్ కోచ్) పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ద్రోణాచార్య అవార్డు గ్రహీత, ఉమెన్ బాక్సింగ్ కోచ్ ఐ.వెంకటేశ్వరరావు విచ్చేసి క్రీడాకారిణులను అభినందించారు. ఈ టోర్నీలో గెలుపొందిన వారు డిసెంబరు 24 నుంచి పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో జరుగబోయే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ రాఘవకుమారి పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభల శ్రీవల్లి, ఎం.సునీత, కె.నీరజ, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగానికి చెందిన వైసుధారాణి, నాగు పాల్గొన్నారు.

కార్పొరేట్ లాభాల కోసం పని చేస్తున్న ప్రభుత్వాలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య



మీడియాతో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

కాకినాడ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ లాభాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని, వారికి సహజ సంపదను దోచిపెడుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య ఆరోపించారు.కాకినాడలోని జయ రెసిడెన్సీ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ అడవులు, గనులు, ఇతర సంపదను ధారాదత్తం చేస్తోందన్నారు. అందుకోసమే మావోయిస్టులను బలవంతంగా తీసుకెళ్లి కాల్చి చంపారన్నారు. అటవీ సంపదను రక్షిస్తున్న 1,600 మంది గిరిజనులను పొట్టనపెట్టుకున్నారన్నారు. తెలంగాణ మాదిరిగా రాష్ట్రంలో కులగణన నిర్వహించి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను తక్షణం రద్దు చేయాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా కేంద్రం గనులు కేటాయించాలన్నారు. ఎందరో త్యాగాలతో నిర్మించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తాటిపాక మధు, కాకినాడ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, నగర కార్యదర్శి పప్పు ఆదినారాయణ, బొబ్బిలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగోన్నతులు

- గ్రేడ్-1 నుంచి డిప్యూటీ ఎంపీడీవోలుగా 118 మంది
- గ్రేడ్-2 నుంచి 1కి 192 మంది
- గ్రేడ్-3 నుంచి 2కి 46 మంది

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖలో పని చేస్తున్న సిబ్బందికి భారీస్థాయిలో ఉద్యోగోన్నతులు పొందారు. ఈ మేరకు పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జోన్ 2(ఉమ్మడి తూర్పుగోదావరి, ఉమ్మడి పశ్చిమ గోదావరి, ఉమ్మడి కృష్ణా జిల్లాలు)లో 118 మంది గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శులు డిప్యూటీ ఎంపీడీవోలుగా, 198 మంది గ్రేడ్ 2 పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్ 1కి, అలాగే 46 మంది గ్రేడ్ 3 పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్ 2కి ఉద్యోగున్నతి పొందారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 62 మంది గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శులు డిప్యూటీ ఎంపీడీవోలుగా, 70 మంది గ్రేడ్ 2 పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్ 1కి, అలాగే 9 మంది గ్రేడ్ 3 పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్ 2కి ఉద్యోగున్నతి పొందారు.



వీధి దీపం.. సూర్య దీపం



మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు సూర్యాస్తమయం సమయంలో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం ఉలుమూరులో విద్యుత్ స్థంభానికి విద్యుత్(వీధి) బల్బు వెలుగుతున్నట్టు కనువిందు చేసింది.

-చింతూరు(ఆంధ్రజ్యోతి).

బాలికల ఖోఖో విజేత తూర్పుగోదావరి

చిత్తూరు జట్టుకు ద్వితీయ స్థానం



బహుమతులు అందుకున్న తూర్పుగోదావరి క్రీడాకారులు

విజయనగరం టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో మూడు రోజుల పాటు జరిగిన 69వ అండర్-17 బాలికల ఖోఖో రాష్ట్రస్థాయి పోటీల్లో తూర్పుగోదావరి జట్టు విజేతగా నిలిచింది. చిత్తూరు, విజయనగరం జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. మంగళవారం హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో తూర్పుగోదావరి 7 పాయింట్లు, చిత్తూరు 6 పాయింట్లు సాధించాయి. నందిని ఆల్‌రౌండ్ ప్రదర్శనతో తూర్పు గోదావరి జట్టు గెలుపొందడంలో కీలక భూమిక పోషించింది. డీఈవో మాణిక్యం నాయుడు, డిప్యూటీ మేయర్ శ్రావణి, ఖోఖో సీనియర్ క్రీడాకారులు ఏవీఎన్, పోస్టల్ కబడ్డీ జట్టు రాష్ట్ర కోచ్ శ్రీనివాసరావు, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి రాంబాబు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘ నాయకులు ఎల్‌వీ రమణ, వెంకటనాయుడు, స్కూల్ గేమ్స్ కార్యదర్శులు గోపాల్, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తలపడుతున్న చిత్తూరు, తూర్పుగోదావరి జిల్లా జట్లు

సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం

దేవరపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద మంగళవారం సాయంత్రం షష్ఠి మహోత్సవాల్లో భాగంగా ఉదయం నుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. గణపతి పూజ, పంచామృతాభిషేకం, నీరాజనమంత్రపుష్పాలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను గ్రామపురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమంలో అర్చకులు అఖండం వీరవెంక ట్రావు శర్మ, సతీశ్‌శర్మ, వంశీకృష్ణమూర్తి శర్మ, కమిటీ సభ్యులు కాట్రు భీమరాజు, ఓరుగంటి లక్ష్మీపతిరాజు, రాంబాబు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడు పెళ్లి కొడుకాయెనే..

- అన్నవరంలో నేడు దివ్యకల్యాణం
- రేపు శ్రీపుష్పయాగ మహోత్సవం

అన్నవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం గ్రామంలో కొలువుదీరిన సుబ్రహ్మణ్యస్వామి దివ్యకల్యాణోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం సుబ్రహ్మణ్యేశ్వరుడు, వల్లీదేవసేనలను పెళ్లికుమారుడు,పెళ్లి కుమార్తెలుగా అలంకరించారు. సాయంత్రం 4గంటలకు ఆలయంలో ప్రత్యేక వేదిక వద్దకు నవ వధూవరులు కానున్న స్వామి,అమ్మవార్లను బాజాభజంత్రీల నడుమ తోడ్కొనివచ్చారు. పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం శ్రీసూక్త, పురుషసూక్త విధానంలో నిర్వహించారు. అనంతరం ఉల్లాకల గౌరీపూజను నిర్వహించగా ముత్తైదువులు పసుపు దంచారు. స్వామి,అమ్మవార్లను విశేష అభరణాలు, సుగంధ భరిత పుష్పాలతో అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం చతుర్వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేసి మహిళలకు నానబెట్టిన శెనగలను ప్రసాదంగా పంపిణీచేశారు. రాత్రి 7గంటలకు స్వామివారిని మయూర వాహనంపై అమ్మవార్లను శేషవాహనంపై ఆశీనులుగా వించి వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయకమిటీ ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.



ప్రత్యేక వేదికపై దర్శనమిస్తున్న సుబ్రహ్మణ్యేశ్వరుడు, అమ్మవారు



పసుపు దంచుతున్న ముత్తైదువులు



వేడుకను వీక్షిస్తున్న భక్తులు

దేవస్థానం హైస్కూల్ ప్రాంగణంలో వేడుక

వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడి దివ్య కల్యాణం బుధవారం రాత్రికి అంగరంగ వైభవంగా జరగనుంది. ఆలయం ఎదురుగా ఉన్న అన్నవరం దేవస్థానం హైస్కూల్ ప్రాంగణంలో ఈ వేడుకను నిర్వహిస్తారు. ఉదయం నుంచి అన్నవరం పరిసర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ప్రత్యేక క్యూలైన్‌లను ఏర్పాటు చేశారు. గురువారం జరిగే శ్రీపుష్పయాగ మహోత్సవంతో వేడుకలు ముగుస్తాయి.

భావనారాయణస్వామి స్థలం ఆక్రమణకు యత్నం

అడ్డుకున్న ఆలయ ఈవో

సర్పవరం జంక్షన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సర్పవరంలో రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామికి చెందిన సుమారు 1500 గజాల స్థలాన్ని ఆక్రమించుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఈవో ఆర్.శ్రీనివాసరావు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... సర్పవరం శివారు నిమ్మన ధన్నయ్యగారి తోటలో సర్వే నెం. 6/4లో 3.93 ఎకరాల భూమి ఉంది. ఇది దేవస్థానానికి చెందిన పౌరహిత్యం నౌకరీగా ఆర్ఎస్ఆర్ నమోదు అయ్యి ఉంది. అయితే ఓ వ్యక్తి సుమారు 1500 గజాల స్థలాన్ని ఆక్రమించుకుని మంగళవారం ఉదయం స్థలంలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, తుప్పలు తొలగించి జేసీబీతో చదును చేయిస్తున్నాడు. స్థానికుల ఫిర్యాదుతో ఆలయ ఈవో ఆర్ శ్రీనివాసరావు సిబ్బందితో కలసి వచ్చి స్థలంలో పనులను నిలుపుదల చేయించారు. ఈ స్థలం దేవదాయశాఖు చెందినదని, ఆక్రమణకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థలంలోకి అక్రమంగా ప్రవేశించినా, అక్రమ నిర్మాణ పనులు చేపట్టిన దేవదాయశాఖ చట్టప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఆక్రమణదారుడికి సెక్షన్ 83 ప్రకారం నోటీసు జారీ చేయడం జరిగిందన్నారు. బుధవారం దేవదాయశాఖ డీఈవో ఆధ్వర్యంలో దేవదాయ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తామని ఈవో శ్రీనివాసరావు తెలిపారు.





అక్రమంగా జేసీబీతో స్థలాన్ని చదును చేయిస్తున్న దృశ్యం, అడ్డుకుని సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఈవో

తుది దశకు రెవెన్యూ అధికారులపై విచారణ

విచారణ అధికారిగా తూర్పుగోదావరి జిల్లా డీఆర్వో
ఉత్తర్వులు జారీ చేసిన రెవెన్యూశాఖ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి

ఎటపాక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలంలో 2018 నుంచి 2021 మధ్య కాలంలో పని చేసి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదుగురు రెవెన్యూ అధికారులపై విచారణ తుది దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా డీఆర్వో సీతారామమూర్తిని విచారణ అధికారిగా నియమిస్తూ మంగళవారం రాష్ట్ర రెవెన్యూశాఖ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు. గతంలో ఎటపాక మండలంలో తహశీల్దార్‌గా పనిచేసిన చాట్ల వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహశీల్దార్లుగా పనిచేసిన సిరిగి నీడి సుబ్బారావు, కారం సుబ్బారావుతో పాటు మండల సర్వేయర్ డిల్లీశ్వరరావు, ఆర్ఐ గొంది రాంబాబు పలు ఫిర్యాదులపై ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఎటపాకకు చెందిన ఓ భూ యజమాని వద్ద ఆ భూమి ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు, పట్టాపుస్తకం జారీకిసొమ్ములు డిమాండ్ చేశారని ఆరోపణలు చేస్తూ సదరు భూ యజమాని 2021 ఏప్రిల్‌లో సీఎంవో కాల్‌సెంటర్‌తోపాటు ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. దీంతో గత జూన్‌లో ఏసీబీ అధికారులు ఈ అంశంపై విచారణ నిర్వహించారు. ఆ సమయంలోనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ ఐదుగురు రెవెన్యూ అధికారులకు రెవెన్యూశాఖ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి నోటీసులు జారీ చేసి పదిరోజుల్లో వివరణ ఇవ్వాలంటూ ఆదేశించారు. ఈ క్రమంలో దీనిపై విచారణ అధికారిగా తూర్పుగోదావరి జిల్లా డీఆర్వో సీతారాంమూర్తిని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఏసీబీ అధికారులు విచారణ నిర్వహించిన డాక్యుమెంట్లు, వాయిస్ రికార్డులు, ఇతరత్ర ఆధారాలను విచారణ అధికారి డీఆర్వోకు అందజేయనున్నారు. ఆ తర్వాత ఏసీబీ అధికారుల నివేదికను డీఆర్వో సీతారాంమూర్తి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించనున్నారు.

బోర్డు తిప్పేసిన వినాయక చిట్స్ అండ్ ఫైనాన్స్

నిర్వాహకులపై కాకినాడ టూటౌన్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు

కాకినాడ క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చిట్టీల పేరుతో సుమారు రూ.30 కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేసిన వినాయక చిట్స్ అండ్ ఫైనాన్స్ కంపెనీ డైరెక్టర్లపై కేసు నమోదు చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. తెలుగు జనతా పార్టీ అధ్యక్షుడు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు, న్యాయవాది వి.రాజేశ్వరరావు ఆధ్వర్యంలో బాధితులు మంగళవారం కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌ను కలిశారు. ఆయన సూచన మేరకు కాకినాడ టూటౌన్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. 500 మంది అమాయక ప్రజల నుంచి పెద్ద ఎత్తున చిట్టీలు వేయించుకున్న కంపెనీ డైరెక్టర్లు బోర్డు తిప్పేసి బాధితుల నెత్తిన శఠగోపం పెట్టారన్నారు. తక్షణమే చిట్‌ఫండ్స్ కంపెనీ డైరెక్టర్లపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై డిప్యూటీసీఎం పవన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.



పోలీస్‌స్టేషన్ వద్ద బాధితుల నిరసన

అందని వైద్యం.. ఆగిన ప్రాణం!

కాకినాడ జీజీహెచ్‌లో ఘటన

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఇటీవల గర్భిణి మరణించిన విషయం విధితమే. ఆ సంఘటన మరువకముందే జీజీహెచ్‌లో వైద్యం అందక ఓ వ్యక్తి మరణించాడు. మృతుడి అల్లుడు గుండా అప్పారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా ప్రత్తిపాడుకు చెందిన గల్లా గోదారయ్య (58)కు ముగ్గురు కుమార్తెలున్నారు. భార్య గతంలో అనారోగ్యంతో చనిపోయింది. గోదారయ్య వ్యవసాయ కూలీ. ఆదివారం పొలంలో పని చేస్తుండగా పక్షవాతం వచ్చి ఎడమ కాలు, ఎడమ చెయ్యి లాగేశాయి. తోటి కూలీలు ఇంటికి సమాచారం చేరవేయడంతో కుటుంబీకులు గోదారయ్యను ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ జీజీహెచ్‌కు తరలించాలని సూచించడంతో అదేరోజు రాత్రి జీజీహెచ్‌కు తరలించడంతో ఎం-7 వార్డులో పెట్టారు. అక్కడ ఇంజక్షన్, నార్మల్ సెలైన్ ఎక్కిస్తూ వైద్యం చేస్తున్నట్టు హడావుడి చేశారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి గోదారయ్య అపస్మారక స్థితిలోకి వెళ్లిపోతుండడంతో కుటుంబీకులు రాత్రంతా వైద్యులు, సిబ్బంది వద్దకు కాళ్లరిగేలా తిరిగారు. కానీ సాకులు చెప్పుతూ పడకపైనే వదిలేశారు తప్ప కనీస వైద్యం అందించలేదు. దీంతో మంగళవారం ఉదయం గోదారయ్య ఉదయం 11.30 సమయంలో మరణించాడు. వైద్యులకు మానవత్వం లేకపోవడంతోనే తన తండ్రి మరణించాడని గోదారయ్య కుమార్తె వరలక్ష్మి వాపోయింది. చివరకు చేసేదేమిలేక మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.



గోదారయ్య మృతదేహం

హైవేపై రెండు మోటార్‌సైకిళ్లు ఢీ

ముగ్గురికి తీవ్రగాయాలు

గొల్లప్రోలు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు శివారు ఎన్‌హెచ్ కూడలి వద్ద మంగళవారం 2మోటార్‌సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. తుని మండలం హంసవరం గ్రామానికి చెందిన ముగ్గురు మోటార్‌సైకిల్‌పై రామచంద్రపురం వైపు వెళ్తున్నారు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నరాల శ్రీహరిబాబు చేబ్రోలులోని ఉన్నత పాఠశాల వైపు నుంచి హైవే వైపు వెళ్తున్నాడు. ఈ సమయంలో ముగ్గురు వస్తున్న మోటార్‌సైకిల్ అదుపు చేయలేక శ్రీహరిబాబును ఢీకొంది. ఈ సంఘటనలో శ్రీహరిబాబు, ఎన్.ఉమాదుర్గాప్రసాద్‌తో పాటు మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వారిని హైవే అంబులెన్స్‌లో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హైవే మొబైల్ పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



గొల్లప్రోలు మండలం చేబ్రోలు జాతీయ రహదారి జంక్షన్ వద్ద ఢీకొన్న మోటార్‌సైకిళ్లు



గాయపడినవారిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

మాక్ అసెంబ్లీకి బెండపూడి విద్యార్థి ఎంపిక

తొండంగి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అమరావతిలో నిర్వహించే మాక్ అసెంబ్లీకి కాకినాడ జిల్లా తుని నియోజకవర్గానికి సంబంధించి బెండపూడి ఉన్నత పాఠశాలకు చెందిన పెయ్యల ఓంకార్ సత్య వెంకట్ ఎంపికయ్యాడు. తమ్మయ్యపేట గ్రామానికి చెందిన సత్యవెంకట్ బెండపూడి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి ఇంగ్లీష్ మీడియంలో చదువుతున్నాడు. మాక్ అసెంబ్లీకి కోసం తమ విద్యార్థి సత్యవెంకట్ అమరావతి బయలుదేరి వెళ్లినట్టు ప్రధానోపాధ్యాయులు నాగం కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్‌కు ఎమ్మెల్యే యనమల దివ్య, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, యనమల రాజేష్, ఎంఈవోలు షేక్ బాబ్జి, సుబ్బిరెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ సాధనాల వీరరాఘవ నూకరాజు అభినందనలు తెలిపారు.



సత్యవెంకట్

నంది అవార్డులు ఇస్తాం

సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్
మలికిపురంలో రాజీ... నో కాంప్రమైజ్ సినిమా షూటింగ్ ప్రారంభం

మలికిపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఉత్తమ తెలుగు సినిమాలకు నంది అవార్డులను ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్టు టూరిజం, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురంలోని చంటిరాజు విల్లాస్‌లో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో రాజీ.. నో కాంప్రమైజ్ సినిమా షూటింగ్‌కు మంత్రి కందుల దుర్గేష్ క్లాప్ నివ్వగా కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కెమెరా స్విచ్చాన్ చేసి ప్రారంభించారు. దుర్గేష్ మాట్లాడుతూ నంది అవార్డుల ప్రదానం కోసం ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లతో ఇప్పటికే చర్చలు జరిపారన్నారు. నంది నాటకోత్సవాల నిర్వహణ కూడా చేపడతామన్నారు. ప్రధానంగా కోనసీమలో కేరళకు మించి అద్భుతమైన లోకేషన్లు ఉన్నాయన్నారు. చిత్ర నిర్మాణాలకు అనుకూలమైన ప్రాంతమని ప్రభుత్వం కూడా ప్రోత్సాహాలు ఇచ్చేందుకు అనుమతులు సులభతరం చేస్తున్నట్టు తెలిపారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ సినిమాలతో పాటు కార్మికులకు అన్ని ప్రయోజనాలు కాపాడేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. రాంకీ మీడియా ప్రైవేటు లిమిటెడ్ పతాకంపై గెద్దాడ వెంకటసత్యప్రసాద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను రాంకీ నిర్మిస్తూ హీరోగా కూడా నటిస్తున్నారు. మరో హీరోగా సందీప్, హీరోయిన్‌గా జయశ్రీ బర్మన్, సహనటులుగా రాజీవ్ కనకాల, పృథ్వీరాజ్, మాధురి, జబర్దస్త్ అశోక్, రాము నటిస్తున్నారు. కేఎం రాధాకృష్ణ సంగీతం సమకూరుస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ గ్రామీణప్రాంతాల్లో భార్యాభర్తల అన్యోన్యతతో పాటు బంధువుల ప్రేమానురాగాలను ఈ చిత్రంలో చూపిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఏపీ మార్కెట్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, కేవీ చంటిరాజు, గెద్దాడ నాగేశ్వరరావు, దిరిశాల బాలాజీ, కేవీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.





సినిమా చిత్రీకరణకు క్లాప్ కొడుతున్న మంత్రి కందుల దుర్గేష్, కెమెరా స్విచ్చాన్ చేస్తున్న మంత్రి సుభాష్

రెండోరోజు ఉత్సాహంగా..

మోరిలో అంతర్‌జిల్లాల ఫెన్సింగ్ టోర్నమెంట్
విద్యార్థులు విజయాలు అందుకోవాలి : మంత్రి సుభాష్

అంతర్వేది, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మోరి హైస్కూలులో 69వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్‌అండర్-17 బాలబాలిక ఫెన్సింగ్ టోర్నమెంట్ రెండో రోజు ఉత్సాహంగా సాగాయి. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి వాసంశెట్టి సుభాష్ ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులంతా క్రీడల్లో పాల్గొని విజయాలు అందుకోవాలన్నారు. ముందుగా స్థానిక నాయకులు, ఉపాధ్యాయ బృందంతో కలిసి వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులతో మాట్లాడారు. విద్యతో పాటు క్రీడా స్ఫూర్తిని కూడా అలవరచుకుని, వివిధ రాష్ట్రాలకు పోటీ ఇవ్వాలన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడానికి విద్యాశాఖ మంత్రి లోకేశ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రతీ విద్యార్థి విద్యతో పాటు వివిధ రంగాల్లో క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో ఇటువంటి టోర్నమెంట్లు నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం మంత్రి సుభాష్‌ను స్థానిక నాయకులు, ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించారు. కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



ఫెన్సింగ్ టోర్నమెంటులో తలపడుతున్న విద్యార్థులు



మంత్రి సుభాష్‌ను సత్కరిస్తున్న స్థానిక నాయకులు

వన్నెచింతలపూడి విద్యార్థినుల ప్రాజెక్టుకు ఉత్తమ అవార్డు



వన్నెచింతలపూడిలో ఉత్తమ ప్రజాస్పందన ప్రాజెక్టు అవార్డు గ్రహీతలకు పౌర సన్మానం నిర్వహించిన దృశ్యం

అమలాపురం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగిన జాతీయ స్థాయి 52రాష్ట్రీయ బాలల విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వన్నెచింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రూపొందించిన ప్రాజెక్టు ఉత్తమ ప్రజాస్పందన ప్రాజెక్టు అవార్డును దక్కించుకుంది. మంగళవారం పాఠశాల ప్రాంగణంలో మల్టీపర్పస్ సైకిల్ మిల్ ప్రాజెక్టు రూపకర్తలైన సోరపల్లి శశివదన, ఉండ్రాజవరపు భవ్యశ్రీజ్యోత్స్న, మార్గనిర్దేశనం చేసిన ప్రధానోపాధ్యాయుడు గుబ్బల నాగ సత్యనారాయణలకు పౌర సన్మానం చేశారు. వివిధ రాష్ట్రాల నుంచి 267 ప్రాజెక్టులను ప్రదర్శనలో ఉంచగా ఏపీ నుంచి వెళ్లిన మల్టీపర్పస్ ప్రాజెక్టు ప్రశంసలు పొంది ఉత్తమ ప్రజా స్పందన ప్రాజెక్టు అవార్డును దక్కించుకోవడం విశేషమని వన్నెచింతలపూడి, సమనస సర్పంచ్‌లు నక్కా రాజారత్నానాగవాణి, పరమట శ్యామ్, ఎంపీటీసీ నాగమణి కొనియాడారు. పాఠశాల కమిటీ ఛైర్మన్ ఎలిపే ముత్యాలబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అవార్డు గ్రహీతలకు దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. మాజీ ఛైర్మన్ కుంచే వెంకటేశ్వరరావు, సదాశివుడు, కె.రమేష్, పరమట భీమామహేష్, గిడుగు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు బడుగు సత్యనారాయణ, అడబాల శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, రాజేశ్వరి పాల్గొన్నారు. ఈ ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు వెండి పతకాలు అందజేయనున్నట్టు గిడుగు నాగేశ్వరరావు ప్రకటించారు.

నేడు కోనసీమకు డిప్యూటీ సీఎం

- పవన్‌కల్యాణ్ పర్యటనకు ముమ్మరంగా ఏర్పాట్లు
- కేశనపల్లిలో డ్రెయిన్ కారణంగా దెబ్బతిన్న కొబ్బరితోటల పరిశీలన

అమలాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గ పరిధిలోని కేశనపల్లి, శివకోడులో జరపనున్న పర్యటనకు ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. భారీ భద్రత నడుమ పవన్ పర్యటనను విజయవంతం చేసేందుకు అటు అధికారులు, పోలీసులతో పాటు జనసేన పార్టీ శ్రేణులు ఏర్పాట్లలో తల మునకలై ఉన్నాయి. శివకోడులోని 2.0 కార్యక్రమాల ప్రారంభంతో పాటు బహిరంగ సభకు కాపు కల్యాణ మండపం ఎదురుగా ఉన్న లేఅవుట్‌లో ఏర్పాటు చేస్తున్నారు. సభలో సుమారు 10వేల మంది ప్రజలు పాల్గొనే విధంగా సన్నాహాలు చేశారు. పవన్ రాక కోసం గూడపల్లి, శివకోడులో ప్రత్యేక హెలిప్యాడ్లను కూడా ఆర్‌అండ్‌బీ అధికారులు సిద్ధం చేస్తున్నారు. పవన్ పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మంగళవారం సాయంత్రం అధికారులతో సమీక్షించారు. అలాగే జిల్లా ఎస్పీ భద్రతా పరమైన చర్యలను ప్రకటించారు. డిప్యూటీ సీఎం పర్యటించే ప్రాంతాల్లో జనసైనికులు భారీగా ఫ్లెక్సులు, జెండాలు ఏర్పాటు చేసి స్వాగత ద్వారాలు సిద్ధం చేశారు. ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో బహిరంగ సభ ఏర్పాట్లతో పాటు పవన్ పర్యటనకు సంబంధించి అన్ని జాగ్రత్తలను తీసుకుంటున్నారు. పవన్ క్రేజ్‌ను దృష్టిలో ఉంచుకుని ఎక్కడా ఎటువంటి అవాంచనీయ పరిస్థితులు తలెత్తకుండా ప్రత్యేక పాస్‌లు ఇచ్చినవారికి మాత్రమే ఆయా ప్రాంతాల్లోకి అనుమతించే రీతిన ఏర్పాట్లు చేశారు. కాగా కేశనపల్లి డ్రెయిన్ వల్ల కొబ్బరిచెట్లకు జరిగిన నష్టం అంచనాలను పవన్‌కల్యాణ్ కేశనపల్లి వంతెన నుంచి వీక్షించి రైతులతో ముఖాముఖిగా మాట్లాడి శాశ్వత పరిష్కారానికి నిర్ణయం తీసుకుంటారని రైతులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.



శివకోడులో పవన్ పాల్గొనే బహిరంగ సభ వేదిక వద్ద ఏర్పాట్లు

పవన్ పర్యటన సాగేదిలా..

ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ బుధవారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్ బేగంపేట నుంచి విమానంలో బయలుదేరతారు. 9.45కు రాజమహేంద్రవరంలోని మధురపూడి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.10 గంటలకు మలికిపురం మండలం గూడపల్లిలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు చేరకుంటారు. 10.15 గంటలకు కేశనపల్లి వ్యూ పాయింట్‌కు చేరకుని శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ కారణంగా దెబ్బతిన్న కొబ్బరి తోటలను పరిశీలిస్తారు. స్థానికంగా 20 మంది బాధిత కొబ్బరి రైతులతో ముఖాముఖిగా తోటలు దెబ్బతినడానికి గల కారణాలపై చర్చిస్తారు. అనంతరం రోడ్డు మార్గాన కేశనపల్లి నుంచి శివకోడుకు 11.20 గంటలకు చేరుకుంటారు. శివకోడులో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తారు. రాష్ట్రస్థాయి పల్లెపండుగ 2.0 పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం శివకోడులో సభాస్థలికి కూతవేటు దూరంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధురపూడి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో బయలుదేరి హైదరాబాద్ వెళతారు.

మండపేట మున్సిపల్ మాజీ ఛైర్మన్ అంత్యక్రియలు

మండపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో మరణించిన మండపేట మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ (51) అంత్యక్రియలు మంగళవారం నిర్వహించారు. అమలాపురం ఎంపీ జీ.హరిష్‌మాధూర్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుతో కలిసి ప్రకాష్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. తొలుత శ్రీవరప్రకాష్ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన నేతలు టీడీపీ జెండాను కప్పారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై ప్రకాష్ పార్థివదేహాన్ని ఏడిద సంఘమేశ్వరంలో ఉన్న కైలాసభూమికి తరలించారు. ప్రకాష్ తనయుడు కిరిటీ అంత్యక్రియలు నిర్వహించారు. ప్రకాష్ అంతిమయాత్రకు భారీసంఖ్యలో ఆయన అభిమానులు, టీడీపీ శ్రేణులు తరలివచ్చారు.



ప్రకాష్ పార్థివదేహంపై టీడీపీ జెండా ఉంచుతున్న ఎంపీ, ఎమ్మెల్యే



అంత్యక్రియల్లో ప్రకాష్ కూమారుదు కిరీటీ, స్థానిక నాయకులు

కాలువలో గుర్తుతెలియని మృతదేహం

యానాం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): యానాం నల్ల చెరువులోకి నీరు వెళ్లే ఫ్రెంచ్ కాలువలో మంగళవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. యానాంలోని ప్రధాన మంచినీటి ట్యాంక్‌లకు ఈ కాలువ నుంచే నీటిని నింపుతుంటారు. ఈ సంఘటనతో యానాంలో అందరు ఆందోళన చెందుతున్నారు. అయితే గత పది రోజులుగా తోడేందుకు అంతగా ఈ కాలువలో నీరు లేకపోవడంతో మంచినీటి ట్యాంక్‌లకు నీరునింపడం లేదు. అయితే వ్యక్తి ప్రమాదవశాత్తు పడిపోవడంతో మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. యానాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గుర్తుతెలియని వ్యక్తి మృతి

మండపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండపేట మున్సిపల్ కార్యాలయం ముందు ఉన్న దుకాణ సముదాయం లోపలభాగంలోని ఖాళీ ప్రదేశంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందడంతో మంగళవారం స్థానికులు గుర్తించారు. ఈ సంఘటనపై స్థానిక పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహంపై లుంగీ కప్పి ఉంది.

చిన్నారి శస్త్ర చికిత్సకు రూ.8 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు

సామర్లకోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణం లోని బలుసులపేటకు చెందిన చిన్నారికి లివర్ సంబంధిత శస్త్ర చికిత్సకు రూ.8లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. చెక్కును చిన్నారి తల్లికి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అందజేశారు. అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే బాబు, బలుసు శ్రీనివాసు, పైజ్జి శ్రీనివాసు, గుడాల శంకర్, బొందల రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్ర కాకినాడ సాధ్యం

ఇన్‌చార్జి కమిషనరు సత్యనారాయణ



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కమిషనరు సత్యనారాయణ

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛమైన, ఆరోగ్యవంతమైన కాకినాడ నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనరు ఎన్వీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం ఆయన 5, 7, 11, 12 సర్కిళ్ల పరిధిలోని పలు వార్డుల్లో పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ సమయానికి వస్తున్నారా, చెత్త సేకరణలో సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. తడి, పొడి చెత్తలను వేరు చేసి ఇవ్వాలన్నారు. కార్మికులు రాని రోజుల్లో చెత్తను రోడ్లపై వేయడం పూర్తిగా మానుకోవాలని, ఇంట్లోనే నిల్వ చేసి మర్నాడు ఇవ్వాలని కోరారు. ప్రతి కుటుంబం బాధ్యతగా వ్యవహరించినప్పుడే పరిశుభ్ర నగర లక్ష్యం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. పర్యటనలో అదనపు కమిషనరు కేటీ సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటేషన్ సూపర్‌వైజర్ రాంబాబు పాల్గొన్నారు.

తుని-కాకినాడ బస్సును కొత్తపల్లి మీదుగా నడపండి

ప్రయాణికుల విజ్ఞప్తి



కొత్తపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తుని నుంచి బీచ్ రోడ్డులో కాకినాడ వెళ్లే ఆర్టీసీ బస్సును కొత్తపల్లి, పిఠాపురం మీదుగా నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. గత నెలలో సంభవించిన మొంథా తుపాను కారణంగా ఉప్పాడ బీచ్ రోడ్డు కోతకు గురైంది. ఆ సమయంలో మరమ్మతులు చేపట్టడంతో తుని-కాకినాడ బీచ్ రోడ్డు సర్వీసును కొత్తపల్లి, పిఠాపురం మీదుగా నడిపారు. మరమ్మతులు పూర్తి కావడంతో ఉప్పాడ నుంచి బీచ్ రోడ్డు మీదుగా కాకినాడ యథావిధిగా తిరుగుతున్నాయి. దీంతో కొత్తపల్లి, కొండెవరం, ఇసుకపల్లి, మాధాపురం, నవఖండ్రవాడ గ్రామాల నుంచి వివిధ పనులపై కాకినాడ వెళ్లేవారు బస్సులు తిరగట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేరే దారిలేక ఆటోలను ఆశ్రయిస్తున్నారు. తుని-కాకినాడ మధ్య ఉప్పాడ బీచ్ మీదుగా వెళ్లే రెండింటిలో ఒక సర్వీసును కొత్తపల్లి, పిఠాపురం మీదుగా కాకినాడ నడపాలని ఆర్టీసీ అధికారులకు ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

షష్ఠి వేడుకలకు సర్వం సిద్ధం



కరప, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కరప-పెనుగుదురు ప్రధాన రహదారిలో 51 అడుగుల భారీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహం వద్ద షష్ఠి వేడుకల నిర్వహణకు ఆలయ ధర్మకర్త, జనసేన నేత చిక్కాల దొరబాబు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గొర్రిపూడి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో రాత్రి కల్యాణం జరిగింది. తెల్లవారుజాము నుంచే భక్తుల దర్శనాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. కరప, వేళంగి తదితర గ్రామాల్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు షష్ఠి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. గొర్రిపూడి ఆలయం వద్ద బాణసంచా కాల్పులు, సాంస్కృతిక కార్యక్రమాలు హైలెట్‌గా నిలుస్తాయి.



ఇంద్రపాలెంలో వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

కాకినాడ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇంద్రపాలెంలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నారు. మంగళవారం కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఈవో జోగా సత్యనారాయణ తెలిపారు. తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకోవచ్చని, ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇంద్రపాలెం ఎస్‌ఐ ఎం.వీరబాబు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాడి రైతుల అభ్యున్నతికి కృషి



కొత్తపల్లి మండలం పొన్నాడ శివారు శీలంవారిపాలెంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని ప్రారంభిస్తున్న రజనీకుమారి

కొత్తపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమపై ఆధారపడి జీవించే రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని పశుసంవర్ధక శాఖ అదనపు సంచాలకురాలు (విజయవాడ) డాక్టర్ ఎన్.రజనీకుమారి పేర్కొన్నారు. రైతన్నా... మీకోసంలో భాగంగా మండలంలోని పొన్నాడ పంచాయతీ శివారు శీలంవారిపాలెంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం కింద సోమవారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. దీనిని ప్రారంభించిన రజనీకుమారి మాట్లాడుతూ పశువులు పూర్తి ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉందన్నారు. పెయ్య దూడల ఉత్పత్తి పథకం కింద పాడి రైతులకు లభించే పథకాలను డాక్టర్లు వివరించారు. పాడి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భం ఎదగని, చూలు కట్టని 65 పశువులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు 50 మేకలకు మసూచి టీకాలు, 30 పాడి పశువులకు దొమ్మ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ కాకినాడ జిల్లా సంయుక్త సంచాలకుడు డాక్టర్ కె.కృష్ణమూర్తి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప సంచాలకుడు డాక్టర్ రాంప్రసాద్, ఉప సంచాలకుడు డాక్టర్ రమేష్‌చంద్ర, పిఠాపురం పశువైద్యురాలు డాక్టర్ కె.ప్రత్యూష, నాగులాపల్లి పశువైద్యులు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ నవీన్, అధికారులు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ తమ్మవరంలో నిర్వహించిన రైతన్నా... మీకోసం అవగాహన సదస్సులో పశుసంవర్ధక శాఖ అదనపు సంచాలకురాలు (విజయవాడ) డాక్టర్ ఎన్.రజనీకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా గొడ్డుమోతు పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. 90 శాతం పెయ్యదూడలు పుట్టే వీర్యం ఖరీదు రూ.900 కాగా రాయితీపై రూ.150కు రైతులకు అందిస్తున్నామని చెప్పారు. పాడి రైతులకు రాయితీపై పశుదాణా, గడ్డి విత్తనాలు, మినీ గోకులాలు అందిస్తున్నామని పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ కోళ్ల కృష్ణమూర్తి తెలిపారు. వచ్చే నెల 3న గ్రామస్థాయిలో కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రైతులతో కలసి రైతన్నా... మీకోసం పోస్టర్‌ని ఆవిష్కరించారు. ప్రాంతీయ పశు ఆరోగ్య పరీక్షా కేంద్రం ఉప సంచాలకుడు డాక్టర్ రామప్రసాద్, సహాయ సంచాలకుడు డాక్టర్ ఎన్‌జేఎస్ సురేష్‌బాబు, పండూరు వైద్యాధికారి డాక్టర్ ఎం.రాజ్యలక్ష్మి, కె.శ్రీనివాసరావు, దుర్గారాజేశ్వరి, ఏవో చీకట్ల సత్యనారాయణ, సర్పంచ్ జి.రామస్వామి, గొల్లపల్లి బాబీ, గొల్లపల్లి వీరబాబు, గ్రామ కార్యదర్శి కె.వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాల మహాసభకు తరలివెళ్లాలి

జిల్లా జనరల్ బాడీ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య పిలుపు



ఎన్జీవో హోమ్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

కాకినాడ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో వచ్చే నెల 26న జరిగే సీపీఐ శతాబ్ది ఉత్సవాల మహాసభకు రాష్ట్రంలోని పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ఎన్జీవో హోమ్‌లో సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని జిల్లా కార్యదర్శి కె.బోడకొండ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత ఆనందభారతి మైదానం నుంచి సమావేశ ప్రాంగణం వరకు తీన్‌మార్ డప్పుల వాయిద్యాల హోరులో ఎర్ర జెండాలతో పార్టీ శ్రేణులు ప్రదర్శన జరిపారు. రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య మాట్లాడుతూ పార్టీ శతాధిక పోరాట గాథలు, కార్మిక-రైతు ఉద్యమాల్లో చేసిన త్యాగాలను స్మరించుకునే విధంగా భారీ ఎత్తున ప్రజలను సమీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువత, రైతులు, విద్యా రంగానికి ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయట్లేదన్నారు. పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి రెండేళ్ల దగ్గర పడుతున్నా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. ఇప్పటికే కట్టిన టిడ్కో ఇళ్లనయినా లబ్ధిదారులకు వెంటనే స్వాధీనం చేయాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు మాట్లాడుతూ దేశంలోని సహజవనరులను దోచుకోవడానికే 'ఆపరేషన్ కగార్' చేపట్టారన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పి.సత్యనారాయణ, బొబ్బిలి శ్రీనివాసరావు, పి.ఆదినారాయణ, శాఖ రామకృష్ణ, ఎ.భవాని, సీనియర్ నాయకులు కిర్ల కృష్ణారావు, చింతపల్లి సుబ్బారావు, టి.అన్నవరం, కిషోర్, రైతు సంఘం నాయకులు నక్క శ్రీనివాసరావు, కొమర్తి శ్రీను, కేశవరపు అప్పలరాజు, చింతపల్లి సుబ్బారావు, ఏఐవైఎఫ్ నాయకులు వై.బాబి, ఎస్.స్టాలిన్, లక్ష్మీనారాయణ, వివిధ సంఘాల నాయకులు మాడుగల రమణ, పి.త్రిమూర్తులు, రామకృష్ణ, లోవకుమారి, పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.





సామర్లకోట, పిఠాపురంల్లో రైతన్నా.. మీకోసం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప, మాజీ ఎమ్మెల్యే వర్మ, టీడీపీ నాయకులు

వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి

సామర్లకోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయరంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోట పట్టణ పరిధిలోని నీలమ్మచెరువు రచ్చబండ వద్ద రైతు సంఘం అధ్యక్షుడు కంటే జగదీష్‌మోహన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిర్వహించిన రైతన్నా... మీకోసం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు, సిబ్బంది ప్రతి రైతునూ కలిసి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకునేందుకు ఐదు అంశాలతో కూడిన ప్రాధాన్యతను తెలియజేస్తున్నారన్నారు. గత పాలకుడు జగన్ జమానాలో వ్యవసాయ రంగం పూర్తిగా కుదేలైందన్నారు. టీడీపీ రాష్ట్ర నాయకుడు రాజా సూరిబాబురాజు, మండల వ్యవసాయాధికారి మురళీధర్ ప్రసంగించారు. అనంతరం రైతులతో కలిసి రైతన్నా మీకోసం కరపత్రాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్‌మోహన్ (బాబు), యార్లగడ్డ రవి చంద్రప్రసాద్ (చిన్ని), అందుగుల మణికుమారి, పైజ్జి శ్రీనివాసు, బలుసు శ్రీనివాసు, జయలక్ష్మి, బొందల రామలక్ష్మి, గోలి కోటేశ్వరరావు, బాబ్జీ, సయ్యద్ సైఫుల్లా, ఎంపీవో మురళీధర్, వీపీఏలు సుజాత, భవిత, ఎంపీ రమణ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులను జగన్ నిలువునా మోసం చేశాడని, వారు ఇంకా కోలుకోలేదని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో 'రైతన్నా మీ కోసం' కరపత్రాలను నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు ఆదాయం రెట్టింపు చేసి రాజుగా తీర్చిదిద్దే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. పంచసూత్రాల అమలుతో రైతుల జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే లక్ష్యమని చెప్పారు. టీడీపీ పట్టణ, మండల శాఖల అధ్యక్షులు బొజ్జా సతీష్, సకుమళ్ల గంగాధర్, ఏలేరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ సోము సత్యనారాయణ, నాయకులు గాది రాజబాబు, అనిశెట్టి సత్యానందరెడ్డి, బర్ల అప్పారావు, పిల్లి చిన్నా, దేవరపల్లి రామారావు, అడ్డూరి శ్రీను, సంగిశెట్టి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

కరప (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతన్నా... మీ కోసం కార్యక్రమాల్లో టీడీపీ నేతలు కటకంశెట్టి బాబి, పెంకే శ్రీనివాసబాబా, చప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి రైతులకు కరపత్రాలు అందజేసి నీటి వినియోగం, సేంద్రియ వ్యవసాయం, డిమాండ్ ఆధారిత పంటల సాగు అంశాలను విశదీకరించారు. వ్యవసాయ శాఖ ఏడీ కె.బాబూరావు, ఏవో ఇమ్మిడిశెట్టి సత్య, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దేవు వెంకన్న, వేములవాడ సొసైటీ చైర్మన్ దూడల నారాయుడు, రెవెన్యూ, ఉద్యాన, పశువైద్య, ఇంజనీరింగ్, ఎనర్జీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.మల్లవరంలో రైతన్నా... మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజనతో పాటు అనేక పథకాలను టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ రైతులకు వివరించారు.

బాక్సింగ్ పోటీల్లో హరిణికి కాంస్య పతకం



పిఠాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం అంతర కళాశాలల మహిళా బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో పట్టణానికి చెందిన క్రీడాకారిణి కాకాడ హరిణి ప్రతిభ కనబరిచింది. రాజమహేంద్రవరంలోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన బాక్సింగ్ 54 కిలోల విభాగంలో ఆమె తృతీయ స్థానంలో నిలవగా నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కేవీ స్వామి కాంస్య పతకం అందజేశారు. హరిణి, కోచ్ పి.లక్ష్మణరావులను పలువురు అభినందించారు.

తెలుగు రాష్ట్రస్థాయి ప్రతిభా పరీక్షల్లో మనోజ్ఞకు రెండో ర్యాంకు



పిఠాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన మన సంస్కృతి సంస్థ తెలుగు భాష రాష్ట్ర స్థాయి ప్రతిభా పోటీలు నిర్వహించింది. ఇందులో భాష్యం స్కూలు 8వ తరగతి విద్యార్థిని జి.మనోజ్ఞ రెండో ర్యాంకు సాధించింది. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి పోటీ ల్లో ప్రైవేటు పాఠశాలల విభాగంలో భాష్యం స్కూలు విద్యార్థులు జిల్లా స్థాయిలో రెండో స్థానంలో నిలిచారు. విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను జోనల్ ఇన్‌చార్జి గోవిందరాజులు, ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు, ప్రైమరీ హెచ్ఎం అరుణ అభినందించారు.

సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయాల వద్ద విస్తృత ఏర్పాట్లు



అలవెల్లి మల్లవరంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి మంగళవారం సాయంత్రానికే చేరుకున్న భక్తులు

గొల్లప్రోలు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తి, అలవెల్లి మల్లవరం క్షేత్రాల్లో స్వయంభూ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలకు ఒకరోజు ముందుగానే భక్తుల తాకిడి ప్రారంభమైంది. సంతానప్రాప్తి కోసం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి దంపతులు భారీ సంఖ్యలో మంగళవారం సాయంత్రానికే చేరుకుని ఉగ్రదష్టి మండపంలో నిద్రించారు. వీరు బుధవారం తెల్లవారుజాము వరకు ఇదే మండపంలో నిద్రించి అనంతరం స్వామికి పూజలు నిర్వహిస్తారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. మల్లవరం క్షేత్రంలో ఏర్పాట్లను కాకినాడ డీఎల్పీవో అన్నామణి, గొల్లప్రోలు ఎంపీడీవో సెలట్‌రాజు, ఆలయ కమిటీ ప్రతినిధులు కుమార భాస్కరరెడ్డి, అరిగెల రామయ్యదొర, మణిబాబు పరిశీలించారు. మల్లవరం, తాటిపర్తి ఆలయాల వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అన్ని శాఖల అధికారులు, ఆయా ఆలయ కమిటీల ప్రతినిధులు ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

రెల్లి క్వార్టర్స్ పనుల పరిశీలన



రెల్లి క్వార్టర్స్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మంగళవారం కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనరు ఎన్వీవీ సత్యనారాయణ, అదనపు కమిషనరు కేటీ సుధాకర్‌లతో కలిసి జగన్నాథపురంలోని రెల్లి క్వార్టర్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ క్వార్టర్స్‌లో అన్ని సదుపాయాలు కల్పించి త్వరలోనే రెల్లి కులస్తులకు అంద జేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈ వెంకట్రావు, మాజీ కార్పొరేటర్ సోమాదుల గోవిందు, నాయకులు గెడ్డం పూర్ణచంద్రశేఖర్, పాలిక నాని, రాళ్లపూడి ప్రకాష్, రాజు, పెదపూడి కుమార్, రేలయ్య, వెంకటరమణ, పండు, నూకరాజు, నిమ్మకాయల దుర్గాప్రసాద్, రాళ్లపూడి వంశీ, నందిని తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచిన పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు



తాళ్లరేవుకు చెందిన గౌరీమహేశ్వరికి మెమెంటో అందజేస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

ఎక్స్‌పోజర్ విజిట్‌లో విద్యార్థుల ప్రతిభ

పిఠాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, విద్యా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఎక్స్‌పోజర్ విజిట్‌లో ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు కొల్లి సుశాంత్, లాలం షణ్ముఖప్రియ, రొంగల సత్యాంబిక జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచారు. వీరికి కాకినాడలో జరిగిన కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనీషా ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు. విద్యార్థులను ఎంఈవో శ్యాంబాబు, హెచ్ఎం రామకృష్ణ, ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ఎస్‌కే దుర్గాదేవి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి అభినందించారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): ఎక్స్‌పోజర్ విజిట్‌లో తాళ్లరేవు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని గుత్తుల గౌరీమహేశ్వరి ప్రథమ స్థానంలో నిలిచింది. ఆమెకు కలెక్టర్ షాన్‌మోహన్ మెమెంటో అందజేశారు.

అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిరంతర నిఘా

డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సుబ్బరాజు

కాకినాడ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలు లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిరంతర నిఘా కొనసాగిస్తామని డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు పేర్కొన్నారు. కాకినాడ రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో మంగళవారం వైద్య-ఆరోగ్యం, రెవెన్యూ, లీగల్, మహిళా శిశు సంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ, డివిజన్ స్థాయి పీసీ, పీఎన్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. డీఐవో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు తెలిస్తే పీసీ, పీఎన్‌డీటీ చట్టప్రకారం సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కాకినాడ డివిజన్ స్థాయిలో 115 స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు జరుగుతున్నాయన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టంపై గ్రామస్థాయిలో వైద్య-ఆరోగ్యం, మహిళా శిశు సంక్షేమ, స్వచ్ఛంద సంస్థలను సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు గర్భిణుల గృహాలను సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో జీజీహెచ్ రేడియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.హరిత, వన్‌టౌన్ సీఐ పి.స్వామినాయుడు, పిఠాపురం పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ చందన, హెల్త్ ఎడ్యుకేటర్లు విజయలక్ష్మి, రాంబాబు, కృష్ణశేఖర్, శృతి, మానిటరింగ్ కన్సల్టెంట్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీజీఈఏ కరప యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కమిటీని అభినందిస్తున్న సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జగన్నాథం, రాంబాబు

కరప, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నడకుదురు సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కరప యూనిట్ నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా ఎంవీఎస్ కిషోర్, ప్రధాన కార్యదర్శిగా కర్రి లక్ష్మీనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా డి.కృష్ణశేఖర్, ట్రెజరర్‌గా పి.శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పాలెపు అశోక్, జాయింట్ సెక్రటరీగా దండు శివన్నారాయణ ఎన్నికయ్యారు. కరప, కాజులూరు, తాళ్లరేవు మండలాల నుంచి ఆయా విభాగాలకు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీని ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు మల్లాడి జగన్నాథం, జనరల్ సెక్రటరీ జ్యోతుల రాంబాబు, జాయింట్ సెక్రటరీ భానుప్రసాద్ అభినందించారు.

'మొంథా తుఫాను బాధిత రైతులను ఆదుకోవాలి'

పెద్దాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ ఏపీ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని పులిమేరు ఎస్సీ పేటలో మంగళవారం ధర్నా నిర్వహించారు. తొలుత రైతు కూలీ సంఘం ప్రతినిధులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు నేతృత్వంలో పొలాల్లో నేలవాలిన, కుళ్లిన పొలాలను పరిశీలించారు. కార్యదర్శి బి.రమేష్, అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, పీడీఎస్‌యూ (వి) రాష్ట్ర కార్యదర్శి గణిత సతీష్, ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కుంచే అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత కంటి శస్త్ర చికిత్స శిబిరం

సామర్లకోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం ఆవరణలో శంకర నేత్రాలయ, ఎర్నేని కుటుంబం, నటరాజ నాట్యాంజలి సంయుక్త సౌజన్యంతో బువారం నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు ఉచిత కంటి పొర శస్త్ర చికిత్స శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు గడ్డమనుగు శివ, కండూరి శ్యామ్, మీసాల సునీత, ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్‌మోహన్ (బాబు) తెలిపారు. ఆలయ ఆవరణలో ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అత్యాధునిక పరికరాలు కలిగిన ప్రత్యేక వాహనంలో శంకర నేత్రాలయం నుంచి నిష్ణాతులైన 25 మంది వైద్యులు హాజరవుతున్నారన్నారు. కంటి శుక్ల పరీక్షలు నిర్వహించి శస్త్ర చికిత్స అవస రమైన వారిని శంకర నేత్రాలయానికి తరలిస్తామన్నారు. ధర్మకర్తల మండలి సభ్యులు చీమలకొండ వీరభద్ర ప్రసాద్, కంచర్ల సుష్మామోహిని, కొండపల్లి సత్యవాణి, మందపల్లి వెంకట భాను వెంకటవర్మ, గోనిపాటి బుల్లెమ్మ, బాడితమాని లక్ష్మి, సన్నిధిరాజు వెంకన్న, అలోక్‌చంద్రజైన్, గొలితి సత్యనారాయణ, అరుణ్‌వంశీ పాల్గొన్నారు.

'ఎరుకుల గిరిజన సంఘానికి కమ్యూనిటీ హాలు నిర్మించాలి'

కాకినాడ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఎరుకుల గిరిజన అభివృద్ధి సంఘం భవనానికి స్థలం కేటాయించి ఎస్టీ సబ్ ప్లాన్ నిధులతో నిర్మాణం పూర్తి చేయాలని కోరుతూ జిల్లా ఆదివాసీ ఎరుకుల గిరిజన అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాసగిరి రాంబాబు, ఉపాధ్యక్షుడు అమలదాసు నూకరాజు మీడియాతో మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలోని 21 మండలాల్లో ఆదివాసీ ఎరుకుల గిరిజన సంఘానికి ఒక్క కమ్యూనిటీ భవన నిర్మాణం చేపట్టలేదన్నారు. ఎన్నికల సమయంలో తమ సామాజికవర్గం ఓట్లను రాజకీయ పార్టీలు వాడుకుంటున్నాయి తప్ప తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపట్లేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించి కమ్యూనిటీ హాలు నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మానుపూడి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి సింగం వీరరాఘవులు, కోశాధికారి గాడా యేసుబాబు, సహాయ కార్యదర్శి సింగం కొండ్రోజులు, నాయకులు అమలదాసు గోవిందు, నేదునూరి సత్యనారాయణ, సీరం లోవరాజు, సంగడాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వేటుకూరికి సన్మానం

ప్రత్తిపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర లేబర్ కార్పొరేషన్ అడ్వయిజరీ బోర్డు ఛైర్మన్‌గా నియమతులైన వేటుకూరి సూర్యనారాయణ రాజును ప్రత్తిపాడుకు చెందిన బీజేపీ కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు సింగిదేవ్ సత్తిరాజు మంగళవారం ఘనంగా సత్కరించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చోటిశెట్టి రమేష్, నాయకులు ఎస్.నాని, గౌస్ చిన్న, మూరా కృపారాయ్ పాల్గొన్నారు.



జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

పోలవరం జిల్లా ఏర్పాటుపై సర్వత్రా హర్షం

చింతూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం (గిరిజన) జిల్లా ఏర్పాటుపై ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో చింతూరు మండల టీడీపీ మంగళవారం హర్షం వ్యక్తం చేసింది. హర్షం వ్యక్తం చేసిన వారిలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఆకోజు నూకాచారి, ఓబులునేని నర్సింహరావు, పొదిలి రామారావు, ఎస్ఏ ఆసిఫ్, శీలం తమ్మయ్య, వాసా శ్రీరామరెడ్డి, కట్ల శంకర్, సురేష్ చౌదరి, ముత్యాల శ్రీరాం, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన జిల్లా ఏర్పాటు హర్షణీయం : చిన్నారెడ్డి



చింతూరు, నవంబరు25(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తీసుకున్న రంపచోడవరం జిల్లా ఏర్పాటు నిర్ణయం హర్షణీయమని టీడీపీ అరకు పార్లమెంటు ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఇల్లా చిన్నారెడ్డి అన్నారు. రంపచోడవరం జిల్లా ఏర్పాటుతో చింతూరు డివిజను ప్రజల కష్టాలు తీరనున్నాయి. జిల్లా కేంద్రానికి వెళ్లాంటే ఇప్పటివరకు ఇక్కడి ప్రజలు చాలా అవస్థలు పడాల్సి వస్తోంది.

ప్రజలు సంతోషపడుతున్నారు: జమాల్‌ఖాన్



రంపచోడవరం జిల్లా ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటన రావడంతో విలీన మండలాల ప్రజల సంతోషపడుతున్నారని చింతూరు టీడీపీ మండల అధ్యక్షుడు జమాల్‌ఖాన్ అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం ఇక్కడి ప్రజల కష్టాలకు ఫుల్ స్టాఫ్ పడనుందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

రాజవొమ్మంగి నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన రంపచోడవరం ప్రత్యేక జిల్లా హామీని అమలుచేసి కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుందని టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు అన్నారు.

'పోషక విలువలను పరిరక్షించుకోవాలి'

వై.రామవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గిరిజన మహిళలు ఆహార సమతుల్యతను పాటిస్తూ పోషక విలువలను పరిరక్షించుకోవాలని రాజమండ్రి జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుమన్ కల్యాణి సూచించారు. మంగళవారం కె.ఎర్రగొండ పంచాయతీ రేగడిపాలెంలో పోషక విలువల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అనంతరం రూ.1500 విలువచేసే 50 పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో బాపనదొర, ఆస్పిరేషన్ బ్లాక్ అధికారి లవన్‌రెడ్డిల దిశానిర్దేశంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ పూర్ణబిందు, డాక్టర్ హేమ, డాక్టర్ కృష్ణకుమారి, పంచాయతీ కార్యదర్శి సంతోష్, సచివాలయ, ఆశా, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతో పాటు ఆరోగ్యంపై దృష్టిసారించాలి: పీవో



విద్యార్థులతో భోజనం చేస్తున్న ఐటీడీఏ పీవో

రంపచోడవరం, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతోపాటు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించారు. పీవో మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం తాజాగా ఉండే పదార్థాలను పెట్టాలని సూచించారు. పాఠశాల ప్రాంగణం పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

ఐటీడీఏ పీవోను కలిసిన ఎస్టీ కమిషన్ చైర్మన్



పీవోకు మొక్కను అందిస్తున్న బొజ్జిరెడ్డి

రంపచోడవరం, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్టీ కమిటీ చైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డి మంగళవారం ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఐటీడీఏ పీవోకు మొక్కను అందజేశారు. అనంతరం గిరిజన ప్రాంత సమస్యలపై చర్చించారు.

క్వారీ బాధితులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం

● ఆదివాసీ సంక్షేమ పరిషత్



ఐటీడీఏ ఎదుట నిరసన తెలుపుతున్న ఆదివాసీ నాయకులు

రంపచోడవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నరసాపురం క్వారీ వలన నష్టపోతున్న దిరిసినపల్లి, నరసాపురం గ్రామాల బాధితులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం చేస్తామని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను అన్నారు. గ్రామాలను రెచ్చగొట్టి దాడి చేయించిన అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరుతూ ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. నిరసనకు భారత ఆదివాసీ పార్టీ నాయకులు పండా కృష్ణమూర్తి, మద్దేటి అంజిరెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కుంజ శ్రీను మాట్లాడుతూ ఆదివాసీలపై ఆదివాసీలను ఉసిగొలిపి దాడులు చేయించి ఆదివాసీ ఐక్యతను దెబ్బతీసేలా చేస్తున్న మైనింగ్ మాఫియా, సహకరిస్తున్న అధికారులకు గుణపాఠం చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ఆదివాసీ హక్కులు, చట్టాలు పరిరక్షణకోసం నిరంతరంగా పోరాటం చేస్తున్న సంఘ నాయకులపై దాడి చేయడాన్ని ఖండించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు తీగల బాబూరావు, మోదిద నూకరాజు, బొరగ ఎర్రమ్మ, చోడి ప్రదీప్ కుమార్‌దొర, పీతా ప్రసాద్, కంగల అబ్బాయిదొర, కలుముల ప్రసాద్‌దొర, చోడిఏడుకొండలరావు, బల్లెం గంగాభవాని, పొడియం అరుణకుమారి పాల్గొన్నారు.

'కుంజా శ్రీనుపై జరిగిన దాడిని ఖండిస్తున్నాం'

అడ్డతీగల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం మండలం నర్సాపురం మైనింగ్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ చట్టాలు పకడ్బందీగా అమలుచేయాలని పోరాటం చేస్తున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీనుపై సాటి ఆదివాసులే దాడి చేయడాన్ని ఆదివాసీ సంక్షేమ పరిషత్ అల్లూరి జిల్లా అధ్యక్షుడు తీగల బాబూరావు ఖండించారు. కుట్రదారులపై, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, గిరిజనేతరులు కలిసి మైనింగ్ మాఫియాకు అడ్డువస్తున్న ఆదివాసీ నాయకులపై దాడిచేయడం అమానుషమన్నారు. ఇలాంటి దాడులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు.

అగ్నిప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

కూనవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని దుమ్ముగూడెం మండలం నరసాపురం చిన అరుణాచలం ఆలయంలో ఈనెల 17న చివరి కార్తీక సోమవారంరోజు జరిగిన అగ్నిప్రమాదంలో కూనవరంనకు చెందిన నాచుపల్లి కృష్ణవేణి(45) తీవ్రంగా గాయపడింది. ఆమెను చికిత్స నిమిత్తం గుంటూరు ఆసుపత్రికి తరలించారు. ఆమె అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. కృష్ణవేణికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఇంటింటా ప్రచారం

చింతూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతన్న మీకోసం కార్యక్రమం చింతూరు మండలంలోని ఎర్రంపేట గ్రామాలలో మంగళవారం టీడీపీ నాయకులు నిర్వహించారు. ఈమేరకు నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలు, వ్యవసాయ మెళకువలు, సేంద్రీయ ఎరువుల వినియోగం అంశాలపై వివరించారు. కార్యక్రమంలో టీడీపీ అరకు పార్లమెంట్ ఎస్టీసెల్ అధ్యక్షుడు ఇల్లా చిన్నారెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి నర్సింహరావు, ఎస్ఏ ఆసిఫ్, సురేష్ చౌదరి, జానీ పాల్గొన్నారు.

కొత్తపల్లిలో...

మోతుగూడెం(ఆంధ్రజ్యోతి): రైతన్న మీకోసం కార్యక్రమంలో ఇంటింటా ప్రచారంలో భాగంగా మంగళవారం చింతూరు మండలం కొత్తపల్లి పంచాయతీ కొత్తపల్లి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి రైతులకు చేస్తున్న సహాయం వ్యవసాయ మెలకువలు సేంద్రియ ఎరువుల వాడకంపై చింతూరు మండల టీడీపీ అధ్యక్షుడు మహమ్మద్ జమాల్‌ఖాన్ అవగాహన కల్పించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మెంబర్ పసుపులేటి సాల్మన్ రాజు, మాజీ సర్పంచ్ కరణం లక్ష్మణ్, వీఆర్‌వో, అధికారులు పాల్గొన్నారు

మెట్టలో జోరుగా వరి నూర్పిడి పనులు

మారిన వాతావరణంతో రైతుల ఆందోళన



పెదశంకర్లపూడిలో ఇబ్బడిముబ్బడిగా వరి నూర్పిడి నిర్వహిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతంలో ప్రస్తుతం ఇబ్బడిముబ్బడిగా వరి నూర్పిడి, వరి కుప్పలు వేయడం పనుల్లో రైతులు తలమునకలయ్యారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి దూసుకు వస్తుండటంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ముంచుకొస్తున్న ఈతుఫాన్ గండం నుంచి ముందుగానే గట్టెక్కాలని ఇప్పటికే కోతలు కోసిన వరి చేలను కుప్పలు వేయడం, నూర్పిడి పనులు మంగళవారం నిర్వహించారు. ప్రత్తిపాడు మండల వ్యాప్తంగా 8600 ఎక రాల్లో ఖరీఫ్ వరి సాగును రైతులు చేపట్టారు. వీటిలో 1600ఎకరాల్లో కోతలు పూర్తయిన ప్రస్తుత తరుణంలో తుఫాన్ ప్రభావం ఉందనే వార్తలు తెలియడంతో రైతులు కోసిన వరి పంటను కాపాడుకునేందుకు నానా హైరానా పడుతున్నారు. పెదశంకర్లపూడి, చిన శంకర్లపూడి, ఉత్తరకంచి తదితర గ్రామాల్లో కోతలు కోసిన వరిని నూర్పిడి చేయడం, కుప్పలు వేయడం వంటి పనులు రైతులు నిర్వహిస్తున్నారు. ప్రత్తిపాడు, రాయవరం, ఏలూరు, ఒమ్మంగి, రాచపల్లి గ్రామాలో వరి కోతలు ఇప్పుడిప్పుడే ప్రారంభమైన పనలు పొలాల్లో ఆరుదలలో ఉన్నాయి. ఏ మాత్రం వర్షం కురిసినా పంటలు కోల్పోవాల్సి వస్తుందని రైతులు కలవరపడుతున్నారు.

ఆధునిక సాగు పద్ధతులు పాటించాలి



నెల్లిపూడిలో రైతులకు కరపత్రాలు అందిస్తున్న సిబ్బంది

శంఖవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతు ఆధునిక సాగు పద్ధతులు అవలంబించాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ పేర్కొన్నారు. మంగళవారం నెల్లిపూడి, అరెంపూడి గ్రామాల్లో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు నీటి సంరక్షణ, డిమాండ్ ఆధారిత సాగు పద్ధతులు వివరించారు. మండలంలో ప్రతీ గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని గాంధీ తెలిపారు.

నేడు బ్రహ్మ విద్యాశ్రమం ప్రారంభం

తొండంగి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఏ.కొత్తపల్లి కదంబవనవాసినీ సంస్థానం ఆధ్వర్యంలో నిర్మితమైన బ్రహ్మవిద్యాశ్రమాన్ని బుధవారం ప్రారం భిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు భూమానంద భారతి తెలిపారు. విఘ్నేశ్వర పూజ, గోపూజ, పుణ్యాహవాచన, మండపారాధన, గౌరీపూజ, వాస్తు, లక్ష్మీగణపతి హోమాలు, సత్యన్నారాయణస్వామి వ్రతం, శ్రీరామచంద్రమూర్తి పూజ, వేదాశీర్వాచనం కార్యక్రమాలు జగురుతాయన్నారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన జరుగుతుందన్నారు.

పెరుమాళ్ళపురంలో రాజ్యాంగ దినోత్సవం



తొండంగి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం, సాంఘిక శాస్త్ర దినోత్సవాల సందర్భంగా పెరుమాళ్ళపురం ఉన్నత పాఠశాలలో మంగళవారం పలు కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశా రు. రాజ్యాంగ విలువలు, పీఠికలపై వివరించారు. దేశపటం నమూనాలో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి దేశమాతను కీర్తిస్తూ నినాదాలు చేశారు. ప్రధానోపాధ్యాయుడు చాట్రాతి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం



మల్లిశాలలో రైతులకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతుల్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మంగళవారం మల్లిసాలలో జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ పైడిపాల సూరిబాబుతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు. ప్రభుత్వం అన్నదాతలకు అందిస్తున్న పథకాలను వివరించారు. పంచ సూత్రాలతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద రెండు విడతల్లో ఒక్కొక్కరికి రూ.14వేలు వంతున అందజేశామన్నారు. అందరూ ప్రకృతి, సేంద్రీయ సేద్యం వైపు మరలాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అడపా భరత్, ఎస్వీఎస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, పైడిపాల సూరిబాబు, అడపా తాతాజీ, వీల్లా చంటిబాబు, సర్వసిద్ధి నూక రత్నం లక్ష్మణరావు, పురం శెట్టి శివాజీ రైతులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రోడ్ల అభివృద్ధి



మురారిలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

గండేపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టిందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మంగళవారం సింగరంపాలెం నుంచి కనుపూరు వరకు రూ.1.20కోట్లతో బీటీ రోడ్డు పనులకు, రూ.కోటితో నిర్మించే మురారి నుంచి కలవచర్ల బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే ఈరోడ్డు నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. గోకవరం నుంచి తిరుమలాయపాలెం, కనుపూరు, సింగరంపాలెం, గండేపల్లి మీదుగా ఆర్టీసీ బస్సు త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోర్పు సాయితేజ్, క్లస్టర్ ఇన్‌చార్జి, మురారి ఉపసర్పంచ్ జాస్తి వసంత్, సుంకవిల్లి రాజు, అక్కిన సుదర్శనరావు, గోరిజాల వెంకన్నదొర, ఉండవిల్లి బుల్లిరాజు, గద్దె అబ్బన్న పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక



కిర్లంపూడి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): యూనియన్ టీచర్స్ ఫెడరేషన్(యూటీఎఫ్) కిర్లంపూడి మండల శాఖ నూతన కమిటీ ఎన్నిక మంగళవారం జరిగింది. గౌరవాధ్యక్షుడిగా కె.ఆదినారాయణమూర్తి, అధ్యక్షుడిగా ఎన్‌వి రమణ, ప్రధాన కార్యదర్శిగా ఎం.నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. నూతన కమిటీని యూటీఎఫ్ నాయకులు ఎంవి.సాయిరాం, సీహెచ్.సూరిబాబు, పివివి.సత్యనారాయణ, ఎస్.వీరబాబు, టీఎస్ఆర్ పురుషోత్తం, ఎవివి రమణ అభినందించారు.

ఉపాధి పనులపై సమీక్ష

గండేపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉపాధి హామీ పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని పంచాయతీల్లో ప్రాధాన్యతా పనులు ప్రారంభించాలని, ప్లాంటేషన్ పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో ఎంపీడీవో కర్రి హరికృష్ణసత్యరెడ్డి, డ్వామా ప్లాంటేషన్ మేనేజర్ వీవీ కిరణ్, ఏపీవో ఎంఆర్ కృష్ణంరాజు, ఈసీ రమేష్, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

28న చిరు వ్యాపారస్తులకు ఉద్యమ ఆధార్ నమోదు

గండేపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఈనెల28న గండేపల్లి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మండలంలోని చిరు వ్యాపారస్తులందరికీ ఉద్యమ ఆధార్ సర్టిఫికెట్ కోసం నమోదు చేస్తామని ఏపీఎం తెలిపారు.

జనసేన ప్రమాదబీమా చెక్కు అందజేత

గండేపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఉప్పలపాడుకు చెందిన లక్కాకుల వెంకటేశ్వరరావు ప్రమాదంలో మృతిచెందాడు. ఆయన జనసేన పార్టీ సభ్యత్వం తీసుకోవడంతో ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు మంగళవారం వెంకటేశ్వరరావు కుమారుడు తాతబ్బాయికి జనసేన క్రియాశీలక ప్రమాదబీమా చెక్కును అందించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, సత్తి సోమ రాజుకు తాతబ్బాయి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జనసైనికులు మింగి వెంకట సత్యనారాయణ, అడబాల వీరబాబు, మద్దూరి రమణ, ఎద్దు శ్రీను, కాటుమల్ల నాగేంద్ర పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతకు కృషి

శంఖవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ అక్షరాస్యతకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఎంఈవో రమణ అన్నారు. చుట్టుపక్కలవారిని, బడిఈడు పిల్లలను బడికి పంపడంలో సఫలీకృతం కావాలన్నారు. మంగళవారం కొంతంగి కొత్తూరు పాఠశాలలో నిర్వహించిన సీతారామా కళాశాల ఎన్ఎస్ఎస్ శిబిరంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు సీతారామయ్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు మొగలి అక్కారావు, వెంకటేశ్వరరావు, కృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలకు క్రీడా పరికరాల అందజేత

తొండంగి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దానవాయిపేట ఉన్నత పాఠశాలకు రూ.65వేలు విలువైన క్రీడా పరికరాలను ఒంటిమామిడి దివిస్ లేబొరేటరీస్ సంస్థ అందించింది. బుధవారం పాఠశాలలో ఆ సంస్థ ప్రతినిధి వాసు బాబు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మహేశ్వరరావుకు అందించారు. సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా 550మంది విద్యార్థులకు క్రికెట్, వాలీబాల్, టెన్నికాయిట్ తదితర కిట్లను అందించామని వాసుబాబు తెలిపారు.



పెళ్లి కుమారుడు, కుమార్తె అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామివారు

షష్ఠి ఉత్సవాలకు పూర్తయిన ఏర్పాట్లు

ప్రత్తిపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): శరభవరంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవార్లను పెళ్లి కుమారుడు, కుమార్తెలుగా అలంకరించి పూజలు జరిపారు. గణపతి పూజతో ప్రారంభించి ఉత్సవమూర్తులకు పుణ్యాహవచనం, రక్షాబంధన ధారణ, విశేష పూజలు నిర్వహించారు. బుధవారం స్వామి, అమ్మవార్లకు వివాహ వేడుక వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. పాల కావిడి సంబరాలు గ్రామోత్సవాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేపట్టారు. చినశంకర్లపూడిలో సర్పంచ్ ఏపూరి రామారావు ఆధ్వర్యంలో నిర్మించిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహాల ప్రతిష్ఠ 9.10 నుంచి 10.10 గంటల మధ్య నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టారు.

కిర్లంపూడిలో చలువ పందిళ్లు



కిర్లంపూడి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రపురం, చిల్లంగి, కృష్ణవరం తదితర గ్రామాల్లో షష్ఠి మహోత్సవాలకు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలను ముస్తాబు చేశారు. ఆలయాల వద్ద చలువ పందిళ్లు వేసి మామిడితోరణాలు కట్టి, విద్యుద్దీపాంకరణలతో తీర్చిదిద్దుతున్నారు. రామచంద్రపురంలో జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో, చిల్లంగి బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కింతాడ సన్యాసిరావు, కృష్ణవరంలో ఆలయ కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

పైలెట్ ప్రాజెక్టుపై శిక్షణ

కిర్లంపూడి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంఈవో టి.జోసెఫ్, ఎం.చిన్నారావు, జగ్గంపేట, ప్రత్తిపాడు సీడీపీవోలు ఎం.పూర్ణిమ, పద్మావతి ఆధ్వర్యంలో మండలస్థాయి కో లోకేటెడ్ పైలెట్ ప్రాజెక్టుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులున్న చోటకు అంగన్‌వాడీ కేంద్రాలను షిఫ్ట్ చేస్తా మన్నారు. ఈ విధానాన్ని జగ్గంపేట ప్రాజెక్టు పరిధిలో కిర్లంపూడి మండలాన్ని పైలెట్ మండలంగా ఎంపిక చేసినట్టు తెలిపారు. దీని వల్ల రెండు శాఖల మధ్య సమన్వయం పెరుగుతుందన్నారు. దీని నిమిత్తం మండలస్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు టి.జోసెఫ్, ఎం.చిన్నారావు, సూపర్‌వైజర్లు సునీత, బూసమ్మ, కరీమున్నీసా, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి కృషి

ఏలేశ్వరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. మంగళవారం మర్రివీడు గ్రామంలో వ్యవసాయాధికారి రాజేష్ నేతృత్వంలో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ, ఎంపీడీవో రవికుమార్ వర్మ, వ్యవసాయ అధికారులు ఇంటింటికీ వెళ్లి రైతులకు కరపత్రాలు పంచి అన్నదాత సుఖీభవ, పీఎం కిషాన్ పథకాలను వివరించారు. టీడీపీ నాయకులు శ్రీకాంత్, బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై వివక్షతను ఎదుర్కొనేందుకు చట్టాలు

జడ్జి గోపీనాథ్

ప్రత్తిపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళలపై జరుగుతున్న వివక్షతను ఎదుర్కొనేందుకు చట్టాలు ఉన్నాయని న్యాయ సేవాధికార సంస్థ మండల చైర్మన్, ప్రత్తిపాడు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి లంకా గోపీనాథ్ చెప్పారు. మంగళవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ మహిళలపై హింస నివారణకు రాజ్యాంగంలో అనేక చట్టాలు పొందుపరిచారని వివరించారు. ప్యానల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, ప్యానల్ అడ్వకేట్లు బుగతా శివ,అవసరాల దేవి, బి.మధుబాబు, కె.సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో డ్రిప్ ఇరిగేషన్‌ను పరిశీలిస్తున్న పీడీ ప్రసాద్ రావు

ప్రతిపాడులో మైనరు ఇరిగేషన్ పీడీ పర్యటన

ప్రత్తిపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో మంగళవారం ఏపీ ఎంఐపీ పీడీ జీవీవీ ప్రసాద్‌రావు పర్యటించారు. రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా పామాయిల్ వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. రైతులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయా పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులతో పాటు రైతులు పాల్గొన్నారు



ఒమ్మంగిలో రైతన్నా మీకోసం ప్రదర్శన చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ, రైతులు

రైతులకు కూటమి ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ప్రత్తిపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చెప్పారు. మండలంలోని ఒమ్మంగిలో రైతన్నా మీ కోసం కార్యక్రమం సందర్భంగా మంగళవారం రైతులతో ప్రదర్శన నిర్వహించారు. ఇంటింటికి తరలివెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా ఉంచేం దుకు ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను ప్రోత్సహిస్తుందని తెలిపారు. రైతులు ఆర్థికంగా మెరుగుపడేవిధంగా వ్యవసాయ పంటలు సాగు చేపట్టాలని సూచించారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిట పంటలు సాగుచేపట్టాలని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఖాదీ బోర్డు వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, బద్ది రామారావు, ఒమ్మంగి కూటమి నాయకులు రామిశెట్టి మునసీబు, కొప్పన నాని, సుంకర సోమరాజు, సత్యంశెట్టి సీతబాబు, సుంకర భవాని, కార్యదర్శి మహేష్, టీడీపీ మండల నాయకులు అమరాది వెంకట్రావు, జింకల తాతారావు, ఇళ్ళ అప్పారావు, మంతెన శ్రీను పాల్గొన్నారు.



రైతులకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ తదితరులు

ఆసుపత్రుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

రౌతులపూడి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టిందని టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ అన్నారు. రౌతులపూడి ఆసుపత్రిపై వచ్చిన కథనంపై మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసుపత్రి అభివృద్ధికి గత ప్రభుత్వం రూ.7 కోట్లు మంజూరు చేసి పనులు పూర్తి చేయలేకపోయిందన్నారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ జోక్యం చేసుకోవడంతోనే ప్రస్తుతం పనులు జరుగుతున్నాయని, పూర్తిస్థాయిలో వైద్యులు ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు.

జిల్లా పరిషత్ హైస్కూల్లో మాక్ పోలింగ్



బ్యాలెట్ పత్రాన్ని అందిస్తున్న విద్యార్థిని

రౌతులపూడి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని రౌతులపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ నందు మంగళ వారం విద్యార్థులతో మాక్ పోలింగ్ మాక్‌పోలింగ్ నిర్వహించినట్టు ప్రదానోపాధ్యాయుడు కోళ్ల రాంబాబు తెలిపారు. ఓటు హక్కు ప్రాధానత్యను వివరి ంచారు. పాఠశాల చైర్మన్ షేక్ సలీం, మాజీ సర్పంచ్ పైల సాంబశివరావు పాల్గొన్నారు.